Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 17.01.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 33 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## క్లైమాక్స్‌లో మ్యాచ్

### తెరపైకి కిరణ్ కొత్తపార్టీ



***భారత్ - పాకిస్థాన్‌ల మధ్య వన్డేమ్యాచ్... పాక్ బ్యాటింగ్ అయిపోయింది. భారత్ బ్యాటింగ్‌లో 49ఓవర్లు అయిపోయాయి. చివరి ఓవర్‌లో 12పరుగులు చేస్తే గెలుపు భారత్‌ది. కాని చేతిలో రెండు వికెట్లే ఉన్నాయి. ఆ రెండు వికెట్లు పడగొడితే విజయం పాక్‌ది. ఇలాంటి మ్యాచ్‌లో ఎంత టెన్షన్ ఉంటుందో ఇప్పుడు అసెంబ్లీలో ఉన్న తెలంగాణ బిల్లు విషయంలోనూ అంతే టెన్షన్ కొనసాగుతుంది.***

టి-బిల్లుపై అసెంబ్లీ అభిప్రాయం కోరుతూ రాష్ట్రపతి విధించిన గడువు ముగియబోతుంది. అసెంబ్లీలో టి-బిల్లుపై చర్చ మొదలైందేగాని ఇంతవరకు అర్ధవంతమైన చర్చ జరగలేదు. టి-బిల్లులోని ప్రతి క్లాజు మీద ఓటింగ్ ఉంటుందా? లేకపోతే అభిప్రాయాలు మాత్రమే చెబితే సరిపోతుందా అనేదాని మీద ఇంతవరకు స్పష్టతలేదు. తెలంగాణ వాళ్లు మాత్రం అభిప్రాయాలు చెబితే చాలంటుంటే, సీమాంధ్ర నేతలు మాత్రం ఖచ్చితంగా ఓటింగ్ జరిపి తీరాల్సిందేనని పట్టుబడుతున్నారు.

టి-బిల్లుపై అసెంబ్లీ పాత్ర కొద్దిరోజుల్లోనే ముగియబోతుంది. బిల్లును ఓటింగ్ ద్వారా తిరస్కరించినా, లేదా వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పినా పెద్దగా ఒరిగేదేమీ లేదు. ఓటింగ్ ద్వారా (మిగతా 14వ పేజీలో)

## పార్లమెంట్ బరిలో...

## ప్రభాకరుడు



**సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడడం ఖాయమైంది. రేపోమాపో కూలనున్న శిథిలావస్థ భవనంలో ఎవరైనా ఎందుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో తన గోతిని తానే తవ్వుకున్న కాంగ్రెస్‌పార్టీ నుండి ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. ఈ వరుసలోనే ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ఉన్నారు. తెలుగుదేశంపార్టీలో చేరే విషయమై ఆదాల ఇప్పటికే ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో చర్చించడం కూడా జరిగింది.**

అయితే ఆదాల ఎక్కడ నుండి పోటీ చేస్తాడనేది ప్రశ్నగా ఉంది. తాను నెల్లూరు లోక్‌సభకు లేదంటే సర్వేపల్లి అసెంబ్లీకి పోటీ చేస్తానని ఆదాల ప్రకటించారు. ఆయన లోక్‌సభకు పోటీ చేయడానికే అవకాశాలు ఎక్కువుగా కనపడుతున్నాయి. తెలుగుదేశంపార్టీకి లోక్‌సభ అభ్యర్ధిగా అంతకంటే గట్టి నాయకుడు కూడా అందుబాటులో లేడు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంపార్టీలో చేరే విషయం ఇంకా ఖరారు కాలేదు. మొదట నెల్లూరు లోక్‌సభకు ఆయన పేరే వినిపించింది. (మిగతా 14వ పేజీలో)

## తెలుగుజాతి గర్వించే ప్రపంచస్థాయి నిర్మాణం...



## GVK సుందర సౌధం..!


ముంబయిలో ప్రారంభం... (వివరాలు 7&10 పేజీలలో)

## • నగరపాలక సంస్థ - 3

## నిర్లక్ష్యం అలుముకుంది...

## అపరిశుభ్రత పులుముకుంది

- నగరం దోమల మయం
- నిర్మూలనను పట్టించుకోని అధికారగణం
- రోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఖాళీ స్థలాలు
- అవే సకలరోగాల ఉత్పత్తి కేంద్రాలు
- కలెక్షన్‌లు తప్పితే పారిశుధ్యంపై దృష్టిపెట్టని సిబ్బంది



*నెల్లూరు నగరం... రాష్ట్రంలోనే ఓ గొప్ప పేరు. నెల్లూరు తిండన్నా, నెల్లూరు భాష, యాసన్నా ఎంతో ప్రసిద్ధి. నాగరికత నగరంగా మొదటి నుండి గుర్తింపు. ఇతర ప్రాంతాల వారి దృష్టిలో నెల్లూరొక సుందర నగరం. కాని ఇక్కడికొచ్చి చూస్తేగాని తెలియదు ఆ నగరం రూపురేఖల గురించి.*

నగరం నరకాన్ని తలపిస్తుంది. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. పాలకవర్గం లేకపోవడంతో అధికారులదే ఇష్టారాజ్యమైంది. అడిగేవాళ్ళు లేకపోవడంతో నగరపాలక సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా ఉంది. వీధులన్నీ చెత్తదిబ్బలుగా వుంటున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. వారానికో, (మిగతా 14వ పేజీలో)

## హద్దుమీరి...

## నోరు జారి!



**విభజనవాదం ఒకే భాష, ఒకే సంస్కృతిగా బ్రతుకుతున్న రెండు ప్రాంతాల ప్రజలను పరస్పర శత్రువులుగా మార్చేసింది. సీమాంధ్ర, తెలంగాణ ప్రాంతాల జనం ఇప్పుడు ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకునే ఆవేశంలో ఉన్నారు. వీళ్లను ఆ స్థాయికి తేవడంలో అన్ని రాజకీయపార్టీలు తలోచేయి వేసాయి.**

విభజన మంటలు మొదలయ్యాక విమర్శలకు అడ్డు అదుపూ అన్నది లేకుండా పోయింది. అయితే విమర్శలు చేయడంలో సీమాంధ్ర నేతలెవరూ హద్దు మీరలేదు. సంస్కారవంతమైన విమర్శలు, వాదనలే చేస్తున్నారు. కాని తెలంగాణనేతలు చాలామంది సంస్కారం లేని విమర్శలతో నోరుజారుతున్నారు. సీమాంధ్రులపై తాగుబోతులు వాడే భాషను వాడుతున్నారు. చాలా నీచంగా మాట్లాడుతున్నారు. కేసీఆర్, వి.హెచ్.హనుమంతరావు, ఈటెల రాజేందర్, పొన్నం ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్ వంటి మూర్ఖులు ఈ విధంగా మాట్లాడారంటే పట్టించుకోవాల్సిన పనిలేదు. కాని ఎన్నో ఏళ్ల రాజకీయ అనుభవం ఉండి, మంచి చెడ్డ తెలిసి ఉండి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కూడా బిరుదు పొందిన కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి కేసీఆర్, పొన్నం ప్రభాకర్‌ల మాదిరిగా స్థాయిని దిగజార్చుకుని మాట్లాడుతున్నాడంటే ఏమనుకోవాలి. కొంతకాలం సావాసం చేస్తే గుర్రాలు గాడిదలవుతాయంటారు. మరి కేసీఆర్, పొన్నం వంటి వారితో కలిసి జైపాల్‌రెడ్డి కూడా వారిలాగే తయారయ్యాడా? అమరజీవి పొట్టి శ్రీరాములు, టంగుటూరు ప్రకాశంపంతులు వంటి మహనీయులు పుట్టిన సీమాంధ్రలో పరమశుంఠలు పుట్టారంటూ నోరుజారి జైపాల్‌రెడ్డి తన మొత్తం కెరీర్‌కే మచ్చ తెచ్చుకున్నాడు. తనపై విమర్శలు వెల్లువెత్తాక ఆ మాటలను వెనక్కితీసుకుంటున్నట్లు ప్రకటించారు. కాని కాలు జారితే తీసుకోవచ్చు గాని నోరుజారితే తీసుకోలేం కదా?

# కలలలోకంలో... కమలపుత్రులు





***తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోబోమని బీజేపీ రాష్ట్ర నాయకులు తెగేసి చెబుతున్నా, లోలోపల మాత్రం ఆ పార్టీ నాయకులు తెలుగుదేశంతో పొత్తు వైపే మొగ్గుచూపుతున్నారు. దేశవ్యాప్తంగా నరేంద్రమోడీ ఇమేజ్ ఉంది. అయితే అది బీజేపీకి ఓట్లు పెంచే స్థాయిలో ఉందేగాని సీట్లు పెంచే స్థాయిలో లేదన్నది పచ్చినిజం. ఓట్లను సీట్లుగా మలచుకోవాలంటే ఆ పార్టీ ఇంకో పార్టీతో జత కట్టక తప్పదు. ఈ నేపథ్యంలోనే బీజేపీ - తెలుగుదేశంల మధ్య పొత్తుకు సన్నాహాలు జరుగుతున్నాయి.***

టీడీపీతో ఖచ్చితంగా పొత్తు కుదురుతుందనే దిశగా ఆ పార్టీ నాయకులు పలువురు పోటీకి సిద్ధమవుతున్నారు. పొత్తు కుదిరితే జిల్లాలో ఒక అసెంబ్లీతో పాటు నెల్లూరు లోక్‌సభ స్థానాన్ని కూడా కోరుకోవాలనే ఆలోచనలో కమలం నేతలున్నారు. జిల్లాలో ఆత్మకూరు నుండి తెలుగుదేశంకు గట్టి అభ్యర్థి లేదు. కాబట్టి పొత్తులో భాగంగా ఈ సీటును బీజేపీకి వదిలే అవకాశాలున్నాయంటున్నారు. బీజేపీకి సీటును కేటాయిస్తే ఇక్కడ నుండి పోటీ చేయడానికి కర్నాటి ఆంజనేయరెడ్డి సిద్ధంగా ఉన్నారు. 1989లో ఆంజనేయరెడ్డి తెలుగుదేశం పొత్తుతో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసారు. కేవలం నెలరోజుల సమయంలో ఆత్మకూరు రాజకీయాన్నే మార్చేసారు. కాంగ్రెస్ అభ్యర్థి బి.సుందరరామిరెడ్డి చేతిలో 30వేల తేడాతో ఓడిపోతాడని అందరూ అంచనా వేస్తే చివరకు సుందర రామిరెడ్డినే ఓడించినంత పనిచేసాడు. ఆ ఎన్నికల్లో బిఎస్ఆర్ చావుతప్పి కన్ను లొట్టపోయిన చందంగా గెలిచాడు. దాదాపు 15ఏళ్ల తర్వాత ఆత్మకూరు నుండి మళ్లీ పోటీకి అవకాశం వస్తే వదులుకోకూడదనే ఆలోచనలో ఆంజనేయరెడ్డి ఉన్నాడు. తన సొంత మండలం సంగం కూడా ఈ నియోజకవర్గ పరిధిలోకే వస్తుండడంతో ఆయన పోటీకి ఉత్సాహం చూపుతున్నారు. కాగా పొగాకు బోర్డు మాజీ డైరెక్టర్ సిహెచ్ రమణప్పనాయుడు కూడా ఆత్మకూరు సీటును ఆశిస్తున్నాడు.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరురూరల్ నుండి పోటీ చేసేపనయితే బీజేపీకి సర్వేపల్లి సీటును కోరాలనే ఆలోచన కూడా వుంది. ఈ సీటు నుండి పోటీ చేయడానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఉత్సాహ పడుతున్నాడు. సోమిరెడ్డి తప్పితే ఇక్కడ నుండి తెలుగుదేశం తరపున పోటీ చేయడానికి ఎవరూ సిద్ధంగాలేరు. ఆయన కూడా ఇక్కడనుండి పోటీకి విముఖత చూపిస్తే బీజేపీకే (మిగతా 14వ పేజీలో)

# ఆశలపై కొత్తనీళ్ళు







ఏ చెట్టు లేని చోట ఆముదం చెట్టే మహావృక్షమన్నట్లు గట్టి అభ్యర్థులు లేని చోట దొరికిన అభ్యర్థులతోనే సర్దుకుపోవడం రాజకీయపార్టీల నైజం. ప్రతి నియోజకవర్గానికి గట్టి అభ్యర్థినే పెట్టాలని ప్రతి పార్టీ భావిస్తుంది. కాని గట్టివాళ్లు లేకుంటే వున్నోళ్లతోనే సర్దుకోక తప్పదు. ఈ జిల్లాలో తెలుగుదేశంపార్టీ మొన్నటివరకు బలహీనంగానే ఉండింది. అంటే పలు నియోజకవర్గాలలో ఆ పార్టీకి గట్టి అభ్యర్థులు దొరకని పరిస్థితి. ఇలాంటి స్థితిలో తమకు టిక్కెట్లు ఖాయమని పార్టీలో కొందరు నాయకులు ఆశించారు. ముఖ్యంగా నెల్లూరునగరం, రూరల్ నియోజకవర్గాలలో తెలుగుదేశం చాలా బలహీనంగా ఉంది. ద్వితీయశ్రేణి నాయకులతోనే ఇక్కడ పార్టీని నెట్టుకు రావాల్సి వచ్చింది. ఈ కోణంలోనే నెల్లూరునగరం సీటుపై మాజీకౌన్సిలర్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. 2009ఎన్నికలలో నగరం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన రమేష్‌రెడ్డి మరీ మూడోస్థానంలోకి పోవడంతో ఈసారి ఆయన పేరును పరిశీలించే అవకాశం లేకుండా పోయింది. ఇక కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాత్రం ఆశలన్నీ బాలకృష్ణపైనే పెట్టుకున్నాడు. గత కొన్నేళ్లుగా శీనయ్య బాలకృష్ణ సేవాసమితి పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ సీటు విషయంలో బాలకృష్ణ నుండి హామీ పొంది ఉన్నాడు. కాని రాష్ట్ర రాజకీయాలలో ఒక్కసారిగా మార్పులు రావడం, కాంగ్రెస్‌లో వున్న పెద్దనేతలు తెలుగుదేశంలోకి దూకుతుండడంతో ఈ పార్టీలో పరిస్థితులు తలక్రిందులవుతున్నాయి. ప్రజారాజ్యం ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం కాంగ్రెస్‌ఎమ్మెల్యేగా వున్న ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తెలుగుదేశంలోకి రానుండడంతో కోటంరెడ్డి శీనయ్య ఆశలు గల్లంతైనట్లే. నగరం టిక్కెట్ శ్రీధరకృష్ణారెడ్డికే ఖరారైనట్లు తెలుస్తుంది. ఎవరూ రాకుంటే ఎవరూ వద్దంటే నెల్లూరురూరల్ సీటు తనకే రావొచ్చని ప్రస్తుతం ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న కిలారి వెంకటస్వామినాయుడు ఆశపడ్డారు. కాని ఇప్పుడు ఆదాల లేదా సోమిరెడ్డిలలో ఒకరు ఆ సీటు నుండి దిగే అవకాశముండడంతో కిలారి ఆశలపై కూడా నీళ్లు చల్లినట్లయ్యింది. మొత్తానికి దేశంలోకి కొత్తనేతలొచ్చి పాతోళ్ల ఆశలను ముంచేస్తున్నారు.

## • మేకపాటి డైలమా

# కేంద్రమంత్రా? రాష్ట్రమంత్రా?



**రాష్ట్ర విభజన జరిగితే సీమాంధ్ర రాష్ట్రంలో తదుపరి జరిగే ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుంది. ఒకవేళ సమైక్యరాష్ట్రంలో ఎన్నికలు జరిగినా కూడా వైకాపాకే ఎక్కువ అవకాశాలుంటాయి. కాబట్టి ఆ సమయంలో శాసనసభ్యుడిగా ఉంటే ఆ పార్టీలో జగన్ తర్వాత అంతటి స్థానంలో ఉన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డికి కీలకమైన మంత్రి శాఖ ఖాయం.**

అదే సమయంలో లోక్‌సభకు ఎన్నికలు జరుగుతాయి. కేంద్రంలో ఎన్డీఏకో లేదంటే కాంగ్రెస్ మద్దతుతో మూడోఫ్రంట్‌కో అధికారం ఖాయం. కేంద్రంలో మూడోఫ్రంట్ అధికారంలోకి వస్తే అందులో వైకాపా మిత్రపక్షంగా ఉండొచ్చు. కేంద్ర కేబినెట్‌లో కూడా ఆ పార్టీ చేరొచ్చు. ఈ లెక్కన చూస్తే ఆరోజు పార్లమెంట్ సభ్యుడిగా ఉంటే మేకపాటి రాజమోహన్‌రెడ్డికి కేంద్రమంత్రి పదవి ఛాన్స్ ఖచ్చితంగా ఉంటుంది. ఈ రెండు ఆప్షన్‌ల మధ్య మేకపాటి రాజమోహన్‌రెడ్డి లోక్‌సభకు పోటీ చేయాలో లేక శాసనసభకు పోటీ చేయాలా అనే విషయంలో డైలమాలో ఉన్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో వైకాపాకు అధికారం ఖాయం కాబట్టి ఎమ్మెల్యేగా ఉంటే మేకపాటికి మంత్రి పదవి కూడా గ్యారంటీ. ఇంత గ్యారంటీ కేంద్రంలో లేదు. అక్కడ ఎన్డీఏకు ప్రభుత్వం ఏర్పాటు చేసే మెజార్టీ వస్తే వైకాపాను దూరంగా పెడతారు. ప్రభుత్వంలోకి తీసుకోకపోవచ్చు. మూడోఫ్రంట్ లేదా కాంగ్రెస్‌లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేటట్లుంటేనే వైకాపా మద్దతు అవసరమవుతుంది. అప్పుడు కేంద్రమంత్రి పదవికి ఛాన్స్ ఉంటుంది. దీనికంటే కూడా గ్యారంటీ ఉన్న రాష్ట్ర మంత్రి పదవిపైనే మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆసక్తి చూపుతున్నాడని తెలుస్తుంది. ఉదయగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మీద వ్యతిరేకత వుందని జగన్‌కు రిపోర్ట్ వెళ్లింది. టిడిపి అభ్యర్థి బొల్లినేని రామారావు నుండి ఆయనకు గట్టి పోటీ తప్పదని అంటున్నారు. ఆయనకు బదులుగా మేకపాటి రాజమోహన్‌రెడ్డిని దింపితే వ్యతిరేకతను అధిగమించవచ్చని, జగన్ గాలితో ఈ సీటును సులభంగా గెలవొచ్చనే ప్రచారం జరుగుతుంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డికి కావాల్సింది కూడా శాసనసభకు ఎన్నిక కావడమే.

ఈ నేపథ్యంలో నెల్లూరు పార్లమెంట్‌కు మంచివ్యక్తిగా పేరున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి గాని, ఆయన తిరస్కరిస్తే వేరేవారిని పోటీకి దించాలనే ప్రతిపాదన వుంది. రాష్ట్రమంత్రిపై ఆశతో ఈమధ్య పార్లమెంట్ కంటే కూడా మేకపాటి రాజమోహన్‌రెడ్డి అసెంబ్లీపైనే ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.



***పంచాయితీ సర్పంచ్ స్థాయి నాయకులు కూడా తాము పదవుల్లో ఉండగానే తమ బిడ్డలను రాజకీయాల్లోకి తీసుకొస్తున్నారు. తమ రాజకీయ వారసత్వం చెదిరిపోకుండా చూసుకుంటున్నారు. కాని ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు కూడా తన రాజకీయ వారసత్వం గురించి ఆలోచించని నాయకుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి.***

## వారసత్వాన్నే కాదు...

# వర్గాన్ని నిలబెట్టుకుంటాడా?

రాజకీయ వారసత్వం కోసం నేదురుమల్లి ఏరోజూ శ్రద్ధ చూపలేదు. ఆయన రాష్ట్ర మంత్రిగా పనిచేసిన రోజుల్లోనే వారసులపై దృష్టిపెట్టి ఉంటే ఖచ్చితంగా ఈరోజు జిల్లాలో నేదురుమల్లి వర్గం బలంగానే ఉండేదేమో! రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పాటు జిల్లాలో నేదురుమల్లి వర్గం కూడా దాదాపు చచ్చుబడిపోయింది. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఇక లేచి రాజకీయాలు చేసే పరిస్థితి లేదు. వెంకటగిరి నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఒక పర్యాయం మంత్రిగా చేసిన రాజ్యలక్ష్మి కూడా ఇక రాజకీయాలలో చురుకుగా ఉండే అవకాశం లేదు. ఇక నేదురుమల్లి కుటుంబం తరపున రాజకీయంగా అవకాశం మిగిలిందల్లా వారి తనయుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికే!

అయితే ఆయన రాజకీయరంగ ప్రవేశం చాలా ఆలస్యంగా జరిగింది. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చురుకుగా వున్నప్పుడే రాంకుమార్‌రెడ్డిని రంగంలోకి దించి వుంటే వాళ్ల వర్గాన్ని కొంతవరకు పట్టుకు రావడానికి అవకాశం ఉండేది. కాని ఈయన ఆలస్యంగా దిగడం, అంతకుముందే జనార్ధన్‌రెడ్డి బలహీన పడడంతో వారి వర్గమే చెల్లాచెదురైపోయింది. ఇప్పుడు కేవలం వెంకటగిరి నియోజకవర్గం వరకే నేదురుమల్లి వర్గం పరిమితమై ఉంది. అరకొర మిగిలిన ఆ వర్గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు రాంకుమార్‌రెడ్డి మీద ఉంది. రేపు ఎన్నికలలో సీటు తెచ్చుకుని వెంకటగిరి నుండి పోటీ చేస్తేనే వాళ్లన్నా మిగులుతారు. లేదంటే నేదురుమల్లి వర్గం పూర్తిగా తెరమరుగే!

# తెరపైకి కొత్త బంగారులోకం

## కొత్త నేతలకు అవకాశం కల్పిస్తున్న 2014









***2014 కొత్త సంవత్సరం... జిల్లాకు ఓ కొత్త నాయక ప్రపంచాన్ని అందించబోతుంది. ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో పాత, కొత్తల కలయికను మనం చూడబోతున్నాం. ఇంతకాలం సాంప్రదాయబద్ధంగా ఒకే రకం నాయకులను చూస్తూ వస్తున్నాం. కాని రేపటి ఎన్నికల్లో మలితరం నేతలు పోటీకి సిద్ధమవుతున్నారు.***

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావంతో రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కొత్త నాయకులు తెరమీదకొస్తున్నారు. ఆ పార్టీ తరపున ఎక్కువశాతం మంది కొత్త నాయకులే అభ్యర్థులుగా ఉండబోతున్నారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి సమన్వయకర్త కొమ్మి లక్ష్మయ్యనాయుడులు తప్ప మిగతా వాళ్లంతా కొత్తవాళ్లే. ఇంతవరకు ఎమ్మెల్యే నిచ్చెన ఎక్కనివాళ్లే. నెల్లూరురూరల్ నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగరం నుండి అనిల్‌కుమార్‌యాదవ్, సర్వేపల్లి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గూడూరు నుండి పాశం సునీల్‌కుమార్ లేదా బత్తిని విజయకుమార్, సూళ్లూరుపేట నుండి సంజీవయ్య, ఆత్మకూరు నుండి మేకపాటి గౌతంరెడ్డి, కావలి నుండి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి... ఇలా అంతా కొత్తనీరే!

తెలుగుదేశం నుండి కూడా ఈసారి పాత కొత్త కలయిక ఉండబోతుంది. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పరసారత్నం, కురుగొండ్ల రామకృష్ణ, బీద మస్తాన్ రావులతో పాటు బొల్లినేని రామారావు, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, గూటూరు కన్నబాబు వంటి నాయకులు దేశం టిక్కెట్ల రేస్‌లో కొత్తగా నిలిచి ఉన్నారు.

కాంగ్రెస్ నుండి ఈసారి ఎక్కువ సంఖ్యలో కొత్త నేతలను దించక తప్పేటట్లు లేదు. ఆనం సోదరులు ఇద్దరు పాతోళ్లే. గూడూరు నుండి పనబాక కృష్ణయ్య గత ఎన్నికల్లో పోటీచేసి ఉన్నాడు. మళ్లీ ఆయనే అక్కడనుండి దిగొచ్చు. వెంకటగిరి నుండి పోటీ చేయాలనుకుంటున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డితో పాటూ ఈసారి నెల్లూరు నగరం, సూళ్లూరుపేట, కావలి, ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులను పోటీకి నిలబెట్టే పరిస్థితులు ఉన్నాయి. వచ్చే ఎన్నికలు ఖచ్చితంగా జిల్లా రాజకీయాలలో మంచి మార్పునే తీసుకువస్తాయి. పాత కొత్తల మిశ్రమ నేతల గణాన్ని అందించనున్నాయి.

# రెండేళ్ళదాకా రాష్ట్ర విభజన జరగదు



మరో రెండేళ్ళు వరకు రాష్ట్ర విభజన జరగదని, సమైక్య రాష్ట్రంలోనే ఎన్నికలు జరుగుతాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని ఏసి సెంటర్ వద్ద ఎన్జీఓ సంఘం ఆధ్యర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకా మాట్లాడుతూ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి పేర్కొంటున్నట్లు తాము శుంఠలైతే వారు మహాశుంఠలని ప్రజలు అంటున్నారన్నారు. తెలంగాణా రాజకీయనేత ముఖ్యమంత్రి హెలికాప్టర్‌ను పేల్చేస్తానని అంటున్నాడని ఆయన రాజకీయ నాయకుడా లేక ఉగ్రవాది నాయకుడా అని ప్రశ్నించారు. ఎన్జీఓ సంఘం నాయకులు చేసిన పోరాటం వల్ల ఈ విభజన వారం వెనక్కిపోయిందని లేకుంటే ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రంలో ఉండే వారమన్నారు. ఈ ఉద్యమం ఆరునెలల ముందే చేసివుంటే తెలంగాణా బిల్లు వచ్చేదికాదని, తెలంగాణా ప్రజలు ఎక్కువమంది ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణబిల్లుపై చర్చ జరిగితే సమస్యలు తెలిపేందుకు వీలవుతుందన్నారు. కొన్ని పార్టీలు సమైక్య ముసుగులో సభలో చర్చ జరగకుండా అడ్డుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం నగర అధ్యక్షులు శేఖర్‌బాబు, వర్మ, గిరి, శైలజ, గౌరవమ్మ, శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమ రాజ్యం రాబోతుంది...



వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్యర్యంలో రైతు సంక్షేమ రాజ్యం వచ్చే సంక్రాంతికి వస్తుందని వైయస్సార్‌సిపి సిఇసి సభ్యుడు సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 15వ తేది తోడేరులో ఉన్న కాకాణిని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాకాణి మాట్లాడుతూ విభజన పేరుతో ఆరు నెలలుగా రాష్ట్రంలో పాలన కుంటు పడిందని, ప్రజలను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. దేశానికి వెన్నెముక రైతు అనే సంగతి మరిచిన పాలకులు విపరీతమైన పన్నుల భారం మోపుతున్నారన్నారు. పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రైతుల కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సమితి మాజీ అధ్యక్షుడు కాకాణి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాడభూషి శ్రీధర్

స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ సమావేశమందిరంలో ఈ నెల 12న సమాచార హక్కు చట్టంపై అవగాహన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కేంద్ర సమాచార కమీషనర్ మాడభూషి శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ స.హ.చట్టం రూపొందించడం రెండో స్వాతంత్ర్యం వచ్చిన విధంగా వుందని, ఇందులో మౌలిక సూత్రాలను పిల్లలకు, పెద్దలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలన్నారు. యువతకు వీటి గురించి అవగాహన ఏర్పడేలా చేయాలని, దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువజనుల సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డులను ఆయన అందించారు. ఈ సందర్భంగా సమాచారహక్కు ప్రచారసాధన సమితి ఆయనకు ఒక వినతిపత్రం అందించింది. నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన "సాహితీ నేస్తం" బులెటిన్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా పరిపాలకులు పెంచలరెడ్డి, సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుధాకర్, నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త సుధాకర్‌రెడ్డి, నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి మాటేటి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపార్టీ ఫ్లెక్సీ పడింది...




ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 23వ తేదీ తర్వాత సొంతపార్టీ పెట్టనున్నాడనే ఊహాగానాలకు బలం చేకూరుతుంది. 'సమైక్యాంధ్రపార్టీ' పేరుతో సీమాంధ్రలోని అన్ని జిల్లాల్లోనూ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఈ పరంపరలోనే గురువారం నెల్లూరులోనూ 'సమైక్యాంధ్రపార్టీ' ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. నెల్లూరులోని దర్గామిట్టలో భారీఫ్లెక్సీలని ఏర్పాటు చేయడం, ఇవి ఎవరు ఏర్పాటుచేసారో తెలియకపోవడం విశేషం.

# సందడిగా ముగిసిన ఫ్లెమింగో ఫెస్టివల్

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట నేలపట్టులోని పక్షుల రక్షిత కేంద్రంలో జిల్లా నుంచి విచ్చేసిన ప్రముఖులతో, అధికారులు, పర్యాటకులతో సందడి నెలకొంది. ఈ నెల 10, 11 తేదీలలో జిల్లా అధికార యంత్రాంగం ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసింది. సంక్రాంతి సెలవులు రావడంతో తొలిరోజు, రెండవ రోజు సందర్శకులతో నెలపట్టు కిటకిటలాడింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణతో పాటు జిల్లా అధికారులు ఎమ్మెల్యే పరసా వెంకటరత్నం తదితరులు పర్యావరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈసందర్భంగా పక్షుల కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి పితానికి సూళ్ళూరుపేట ఎమ్మెల్యే పరసా వెంకటరత్నం కోరారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా సూళ్ళూరుపేటలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో వివిధ ప్రభుత్వశాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసాయి. వీటిలో షార్‌తో పాటు వన్యప్రాణి సంరక్షణ విభాగం, ఉద్యానశాఖస్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం ఆధ్యర్యంలో నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, పులికాట్ సరస్సు నమూనాలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్ కూడా సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నేలపట్టులోని పక్షుల అందాలను తిలకించేందుకు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ కుటుంబ సభ్యులు, ఏఎస్పీ రెడ్డి గంగాధర్, గూడూరు డిఎస్పీ చౌడేశ్వరి, ఐటిడిఏ పిఓ వెంకటేశ్వర్లు తదితర అధికారులు కుటుంబ సమేతంగా తరలి వచ్చారు. తహశీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపిడిఓ సురేష్‌బాబు, ఎంఈఓ కొండయ్య, ఆర్‌డబ్ల్యు ఎస్‌డిఈ మోహన్‌రావు, జడ్పీ సిఇఓ జితేంద్ర తదితర అధికారులు ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్శనలో పాల్గొన్నారు.



పక్షులపండుగను ప్రారంభిస్తున్న మంత్రి పితాని సత్యనారాయణ, పక్కన ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే పరసారత్నం, ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ తదితరులు


# డాక్టరేట్ సాధించిన ఎండ్లూరు శ్యామసుందరం



పట్టుదలతో కృషి చేస్తే ఫలితం గొప్పగా వుంటుందనే దానికి ఉదాహరణగా నిలుస్తున్నారు నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఎండ్లూరు శ్యామసుందరం. 1964, జూలై4న ఎండ్లూరు పెదపెంచలయ్య, వెంకాచమ్మ దంపతులకు జన్మించిన శ్యామసుందరం 1982లో పోలీస్ కానిస్టేబుల్‌గా, 1982-95సం.ల మధ్య నెల్లూరుజిల్లాలో ఉద్యోగం చేస్తూ 1995లో నేరుగా పరీక్షలలో ఉత్తీర్ణులై సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా కర్నూలుజోన్‌లో విధుల్లో సమర్థతను చాటుకున్నారు. 2009లో సిఐగా పదోన్నతి పొంది ప్రస్తుతం తిరుపతిలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే ఎంఏ, ఎంఎల్ చదువుకు అదనంగా పిహెచ్‌డి పట్టా సాధించి డాక్టరేట్ పొందడం చిన్న విషయం కాదు. డా॥ కె.శ్రీనివాసరావు, ప్రొ॥ విఆర్‌సి కృష్ణయ్యల నేతృత్వంలో హ్యూమన్‌రైట్స్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్‌లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఈనెల16న ఆయన పిహెచ్‌డి పట్టాపొందారు. డా॥శ్యామసుందరంకు 'లాయర్' శుభాభినందనలు.

# వికసించిన మానవత్వం

## వృద్ధులు, వికలాంగుల కోసం పివిఆర్ ట్రస్ట్ ఉచిత బస్సు ఏర్పాటు




ఉచితబస్సును ప్రారంభిస్తున్న ఆనం రంగమయూర్‌రెడ్డి

సంపాదించేదానికన్నా సమాజానికి సహాయం చేయడంలోనే ఎక్కువ ఆనందం పొంది, మానవసేవే మాధవసేవని తలచే పూండ్ల వెంకురెడ్డి నెల్లూరు నగరంలో వృద్ధులకు, వికలాంగులకు ఉచిత బస్సును ఏర్పాటు చేసారు. దీనిని నెల్లూరు గాంధీబొమ్మ కూడలిలో ఇటీవల కాంగ్రెస్ యువనేత ఆనం రంగమయూర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేను సంవత్సరాలుగా నెల్లూరులో పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ అందిస్తున్న సమాజసేవలను కొనియాడారు. ఒకప్పుడు దుర్గంధభరితంగా, నరకానికి నమూనాగా వుండిన నెల్లూరు బోడిగాడితోటలోని స్మశానవాటికను అత్యంత అధునాతనంగా, స్వర్గానికి వాకిలిగా తీర్చిదిద్దడంలో ట్రస్ట్ పాత్ర శ్లాఘనీయమన్నారు. వేసవిలో దాహార్తి తీర్చేందుకు ఉచిత మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేయడం, పార్థివ శరీరాలను స్మశానానికి తరలించేందుకు ఉచిత వాహనాలు తదితర సేవలు ట్రస్టు ఉన్నతిని తెలియజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ హరనాథ్‌రెడ్డి, ప్రముఖ బిల్డర్ మహీధర్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.




## మత ప్రమేయం తగ్గించండి

ప్రజల జీవన విధానంలో మత ప్రమేయం ఎక్కువుగా వుంటుంది. ప్రజలు ప్రార్ధనలకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుంది. బహిరంగ ప్రదేశాలలో నిర్వహించే పలు మత సభలకు వేల సంఖ్యలో ప్రజలు పనులు మానుకుని పోతున్నారు. దైవభక్తి మనసుకు సంబంధించింది. చేసే పనిలో దైవాన్ని చూడాలి. పదిమందికి సాయపడడమే దైవత్వం. మత ప్రచారాల పేరుతో కాలం వృధా చేయడం అనవసరం.

సి. ధృవకుమార్, నెల్లూరు.

## అరవింద్ ఆదర్శం

అధికార బంగ్లాలు, సెక్యూరిటీ, హంగు, ఆర్భాటం తిరస్కరించి పరిపాలనలో కొత్తదనానికి నాంది పలికాడు అరవింద్ కేజ్రీవాల్. నాయకులంతా ఆయనను ఆదర్శంగా తీసుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థపై ఎంతో భారాన్ని తగ్గించవచ్చు. పోలీసు బలగాలను ప్రజారక్షణకు వాడుకోవచ్చు. నాయకులు నిరాడంబరతకు అలవాటు పడితే ప్రజాధనం వృధాను అరికట్టొచ్చు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## బీజేపీ ఆలోచించాలి

రాష్ట్ర విభజన బిల్లుపై బీజేపీ ఆలోచించాలి. సీమాంధ్రకు ఉరి బిగిస్తూ ఉన్నదంతా తెలంగాణకు దోచి పెట్టేలా ఉన్న ఈ పక్షపాత పూరిత బిల్లును బీజేపీ వ్యతిరేకించాలి. సీమాంధ్రకు న్యాయం జరిగాకే తెలంగాణ బిల్లుకు మద్దతిచ్చేలా బీజేపీ వ్యవహరించాలి.

డి.వి. సుజాత, హైదరాబాద్.

## బుద్ధి మందగించింది

వయసు పెరిగిన ప్రభావమో ఏమోగాని కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డికి బుద్ధి మందగించినట్లుంది. సీమాంధ్రులను శుంఠలతో పోలుస్తూ ఆయన మాట్లాడిన తీరు ఆయన పెద్దరికాన్నే పోగొట్టింది. ఇంత కాలం సీమాంధ్రులకు కూడా జైపాల్ అంటే ఒక గౌరవభావం వుండేది. దానిని ఆయనే పోగొట్టుకున్నాడు. తెలంగాణ స్వార్థ రాజకీయాల్లో తాను ఒక పావుగా మారాడు. పెద్దరికానికి విలువ లేకుండా చేసాడు.

జి. మహేష్, తిరుపతి.

# 'ప్రభా'తం

## సీట్లకు "ప్రధాని" ఎర



*తమ సొంత రాష్ట్రాలలో ఎంపీ సీట్లను ఏక మొత్తంగా కొల్లగొట్టడానికి ప్రాంతీయపార్టీల నేతలందరు కూడా ప్రధాని కార్డును వినియోగిస్తున్నారు. నేను ప్రధాని అయితే మన రాష్ట్రం బాగుపడుతుంది, ప్రాజెక్ట్‌లన్నీ మన రాష్ట్రానికే వచ్చేలా చేస్తామని ప్రాంతీయపార్టీల నాయకులు తమ రాష్ట్ర ప్రజలకు పిలుపునిస్తున్నారు.*

భారతదేశ ప్రధాని పదవి చాలా చీప్ అయిపోయింది. ఒకప్పుడు పార్లమెంటులో 273మెజార్టీ మార్క్ సీట్లు వచ్చిన పార్టీకే ప్రధాని అవకాశం ఉండేది. అన్ని సీట్లు సాధించగలిగిన జాతీయస్థాయి నాయకులే ప్రధాని అయ్యేవాళ్లు. ప్రాంతీయ స్థాయిలో ప్రధాని పదవి మీద ఆలోచన ఉండేది కాదు. కాని ఇప్పుడు జాతీయ నాయకులకంటే ప్రాంతీయపార్టీల నాయకులే ఎక్కువుగా ప్రధాని పదవికి ముస్తాబవుతున్నారు.

నెహ్రూ, ఇందిర, వి.పి.సింగ్, పి.వి.నరసింహరావు, వాజ్‌పేయిలు దేశానికి ప్రధానులయ్యారంటే అర్థముంది. జాతీయస్థాయిలో వారు పార్టీలను నడిపించారు. మెజార్టీ సీట్లలో తమ పార్టీలను గెలిపించుకుని ప్రధానులు కాగలిగారు. చరణ్‌సింగ్, చంద్రశేఖర్ లాంటి నాయకులు యాభయ్యేసి సీట్లను పెట్టుకుని దేశ ప్రధాని పదవిని చేపట్టగలిగారు. ఇదన్నా ఒక రకంగా నయం. 6సీట్లున్న దేవేగౌడ కూడా దేశానికి ప్రధాని అయ్యాడు. 1996లో అధికారంలోకి వచ్చిన యునైటెడ్ ఫ్రంట్ కూటమిలో దళ్(ఎస్)కు వున్నది ఆరు సీట్లే. ఆ సీట్లతోనే దేవేగౌడ ప్రధాని కాగలిగాడు. ఆరు సీట్లు వచ్చిన దేవేగౌడనే ప్రధాని కాగాలేనిది పది నుండి పాతిక సీట్లు తెచ్చుకునే మేం ప్రధానులం కాలేమా అనే ధీమా ప్రధాన ప్రాంతీయ పార్టీల నేతలలో బలంగా పెరిగింది.

జాతీయ పార్టీలైన బీజేపీ సారధిగా నరేంద్ర మోడీ, కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ ప్రధాని రేసులో వున్నారు. ఆ రెండు పార్టీలకు కూడా సార్వత్రిక ఎన్నికలలో వంద సీట్లన్నా దాటుతాయి. కాని ఉత్తరప్రదేశ్‌లో 80సీట్లకు మాత్రమే పోటీ చేసే సమాజ్‌వాదీపార్టీ అధినేతగా ములాయం సింగ్‌యాదవ్, బీహార్ రాష్ట్రానికే పరిమితమయ్యే దళ్(యు) అధిపతిగా నితీష్‌కుమార్, పశ్చిమబెంగాల్‌లో మాత్రమే హవాచాటే మమతా బెనర్జీలు కూడా ప్రధాని రేస్‌లో నిలిచిఉన్నారు. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత కూడా ప్రధానమంత్రి కావాలనే తన మనసులోని కోరికను బయట పెట్టింది. తాజాగా ఢిల్లీలో కాంగ్రెస్‌ను తుడిచిపెట్టేసి, అదే కాంగ్రెస్ మద్దతుతో అక్కడ తిష్టేసి జాతీయ రాజకీయాలలోనే పెనుసంచలనంగా మారిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పేరు కూడా ప్రధాని రేసులో వినిపిస్తుండడం విశేషం.

తమ సొంత రాష్ట్రాలలో ఎంపీ సీట్లను ఏకమొత్తంగా కొల్లగొట్టడానికి ప్రాంతీయ పార్టీల నేతలందరు కూడా ప్రధాని కార్డును వినియోగిస్తున్నారు. నేను ప్రధాని అయితే మన రాష్ట్రం బాగుపడుతుంది, ఉన్న ప్రాజెక్ట్‌లు, నిధులు అన్నీ మన రాష్ట్రానికే వచ్చేలా చేస్తాను. నేను ప్రధాని కావాలంటే మన రాష్ట్రంలో వున్న అన్ని సీట్లలో మన పార్టీనే గెలిపించాలని ఆయా ప్రాంతీయపార్టీల నాయకులు తమ రాష్ట్ర ప్రజలకు పిలుపునిస్తుండడం చూస్తూనే వున్నాం. ఇటీవల తమిళనాడులోని ఓ సభలో ముఖ్యమంత్రి జయలలిత ఇలాంటి ప్రసంగమే చేసారు. తమిళనాడు నుండి మీరు మెజార్టీ సీట్లు అందిస్తే ఈసారి తమిళులదే ప్రధాని పీటమంటూ ఆమె వ్యాఖ్యానించారు. ప్రాంతీయపార్టీల నేతలు ప్రధానిపదవిపై ఇంతగా ఆశలు పెంచుకుంటుండడానికి ప్రధాన కారణం మూడోకూటమి. యూపిఏ ఈసారి అధికారాన్ని కోల్పోవడం ఖాయం. ఎన్డీఏకు పూర్తి మెజార్టీ రాదు. నరేంద్రమోడీ ఇమేజ్ ఎంత బలంగా పనిచేసినా ఎన్డీఏకు 200సీట్లు దాటడం కష్టమే. అలాంటి దశలో ఎన్డీఏ అధికారంలోకి రాకుండా చూసేందుకు వామపక్షాలు, మరికొన్ని ప్రాంతీయపార్టీలు కలిసి మూడోకూటమిని ఏర్పాటు చేసుకుంటాయి. ఎన్డీఏ అధికారంలోకి రావడం కాంగ్రెస్‌కు ఇష్టముండదు కనుక అప్పుడు ఈ మూడోకూటమికే కాంగ్రెస్ మద్దతు తెలపక తప్పదు. ఈ సమయంలో మూడోకూటమి నుండి ప్రధానమంత్రి ఎవరనే ప్రశ్న వస్తుంది. స్వతహాగా వామపక్షాలు ప్రధాని పదవికి దూరంగా వుండే అవకాశముంది. పోతే ప్రాంతీయ పార్టీల నుండే పోటీ ఉంటుంది. ప్రాంతీయపార్టీలలో ఎవరికి ఎక్కువ సీట్లు వచ్చి ఉంటే వారిది పైచేయి కావచ్చు. మరి పైచేయి కావాలంటే సొంత రాష్ట్రాలలో మెజార్టీ సీట్లు సాధించాలి.

ప్రస్తుతం వివిధ పక్షాల నేతలు అదే ప్రక్రియను ప్రారంభించారు. యూపీలో ములాయంసింగ్ యాదవ్, బీహార్‌లో నితీష్‌కుమార్‌లు ప్రధాని కార్డ్‌ను ప్రయోగిస్తూ మెజార్టీ సీట్లు గెలుచుకోవాలనే ఆరాటంలో ఉన్నారు. ప్రధాని పదవి మీద యావతో జయలలిత కూడా ఇదే ప్రచారం నిర్వహిస్తుంది.

ఈ తరహా పోకడలు పెరిగితే దేశానికే ప్రమాదకరం. జాతి హితాన్ని ఆలోచిస్తూ, దేశ ప్రయోజనాల కోసం పని చేయాల్సిన ప్రధాని పదవిలోకి ప్రాంతీయభావాలు, సంకుచిత స్వభావాలు గల నేతలు వస్తే దేశ సమైక్యతకే అది గొడ్డలిపెట్టులా మారుతుంది. రాష్ట్రాల మధ్య సమతుల్యత దెబ్బతిని అసమానతలు పెరిగే అవకాశముంది.

గత రెండు దశాబ్దాలుగా దేశంలో సంకీర్ణ యుగం నడుస్తుంది. ఈ ప్రభుత్వాలలో భాగస్వాములుగా వుంటున్న కొన్ని ప్రాంతీయపార్టీలు కేంద్రాన్ని బ్లాక్‌మెయిల్ చేసో, ఒత్తిడి చేసో అభివృద్ధి ప్రాజెక్టులన్నీ తమతమ రాష్ట్రాలకు తరలించుకుపోతున్నాయి. దీనివలన చిన్నచిన్న రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడిపోతున్నాయి. ప్రధాని పదవిపై ప్రాంతీయపార్టీల ప్రభావం పోవాలి. జాతి విశాల ప్రయోజనాలను కాపాడే జాతీయ నాయకులే ప్రధాని పదవికి అర్హులుగా పరిగణించాలి. అప్పుడే జాతీయస్థాయిలో రాజకీయాలు మంచి దారిలోకి వస్తాయి.

# 'అంతర్'జాతీయం

- సిగ్నలింగ్ వ్యవస్థలో పొరపాట్ల కారణంగా ఎదురెదురుగా వచ్చే రైళ్లు ఢీకొనకుండా నిరోధించేందుకు చేపట్టిన ప్రయోగం విజయవంతమైనట్లు భారత రైల్వే పరిశోధనా సంస్థ ప్రకటించింది. దీనికి రైల్వేశాఖ 35కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.
- రాజస్థాన్‌లో రైతులకు 5రూపాయలకే భోజనం అందించే పథకానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తమ ఉత్పత్తులను విక్రయించడానికి హోల్‌సేల్ మార్కెట్లకు వచ్చే రైతులకు 5రూపాయలకే పూర్తిస్థాయి భోజనాన్ని అందించనున్నారు.
- భారత సైనిక అకాడమీలో నియామకాలకు సంబంధించి భారీ కుంభకోణాన్ని సీబీఐ బయటపెట్టింది. 2011-12లో సైనిక అకాడమీలో గ్రూప్ సి, డి కేడర్లలో నియామకాల సందర్భంగా కల్నల్స్ అఖిలేష్‌మిశ్రా, జగదీష్‌బిష్ణోయ్, అంబరీశ్‌తివారీలు పలువురికి నకిలీ అనుభవ ధృవపత్రాలు అందజేశారని సీబీఐ పేర్కొంది. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసింది.
- ఇజ్రాయిల్ మాజీప్రధాని ఎరియల్ షరాన్ ఈ నెల 11న మరణించారు. 2001 నుండి 2006 దాకా ఆయన ఇజ్రాయిల్ ప్రధానిగా పనిచేశారు. 2003లో ఆయన భారత్‌ను సందర్శించారు. భారత పర్యటనకు వచ్చిన తొలి ఇజ్రాయిల్ ప్రధాని ఆయనే.
- ప్రపంచంలోనే అత్యంత ప్రశంసనీయవ్యక్తుల్లో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ మొదటి స్థానంలో నిలిచారు. కాగా ఒబామా రెండోస్థానంలో, పుతిన్ మూడోస్థానంలో నిలిచారు. మన దేశం నుండి సచిన్ 5వ స్థానంలో, నరేంద్రమోడీ 7వ స్థానంలో, అమితాబ్‌బచ్చన్ 9వ స్థానంలో, అబ్దుల్‌కలాం 10వ స్థానంలో నిలిచారు. అన్నా హజారేకు 14వ స్థానం, అరవింద్‌కేజ్రీవాల్‌కు 18వ స్థానం, రతన్ టాటాకు 30వ స్థానం దక్కింది. తొలి పదిమందిలో నలుగురు భారతీయులకు చోటుదక్కడం విశేషం.
- పాకిస్థాన్ సైన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే తాము ధీటుగా స్పందిస్తామని భారత సైన్యాధిపతి జనరల్ బిక్రంసింగ్ ఘాటుగా హెచ్చరించారు. ఇటీవల భారత్ చేపట్టిన సైనిక చర్యలో 10మంది పాక్ సైనికులు చనిపోయారని చెప్పారు. నియంత్రణరేఖ వద్ద కాల్పుల ఉల్లంఘన జరిగినప్పుడల్లా ప్రాంతీయస్థాయిలో చిన్నపాటి యుద్ధం చెలరేగుతుందన్నారు.
- హిందూ - ముస్లింల సంబంధాలు ఇటీవలకాలంలో తీవ్ర పరీక్షలకు గురయ్యాయని ప్రధాని మన్మోహన్‌సింగ్ పేర్కొన్నారు. 13వ తేదీ ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల మైనార్టీ కమీషన్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ భారతీయ లౌకిక భావానికి కొందరు కొత్త నిర్వచనాలు చెబుతున్నారని, ఇలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- ముఖ్యులకే ముక్కోటి. – టీటీడీపై భక్తుల ఆగ్రహం.
**వ్యాఖ్య :- *ముక్కోటిని ముఖ్యోటి అనుకుంటున్నారేమో!***

వార్త :- మా గురువు పవార్ ప్రధానైతే సంతోషమే. – షిండే.
**వ్యాఖ్య :- *శిష్యుడు రాహుల్ అయితే బాధపడతారా?***

వార్త :- వచ్చే నెలలో లౌకిక కూటమి. – ప్రకాశ్‌కారత్.
**వ్యాఖ్య :- *అది ఏ నెలలో విచ్ఛిన్నమవుతుందో కూడా చెప్పండి.***

వార్త :- జగన్‌తో వచ్చేది హిట్లర్ రాజ్యమే. – మారెప్ప.
**వ్యాఖ్య :- *ఇప్పుడుండేదేమన్నా రామరాజ్యమా?***

వార్త :- బాగా పనిచేస్తున్నాం... చెప్పుకోలేక పోతున్నాం. – రాహుల్‌గాంధీ.
**వ్యాఖ్య :- *మీరు చేస్తున్నవి చెబితే వచ్చే ఓట్లు కూడా పోతాయి.***

వార్త :- ముసాయిదా బిల్లును చిత్తుగా ఓడిస్తాం. – రఘువీరారెడ్డి.
**వ్యాఖ్య :- *లేదంటే మీరు చిత్తుగా ఓడుతారు.***

వార్త :- వచ్చే సంక్రాంతి సమైక్యరాష్ట్రంలోనే! – అశోక్‌బాబు.
**వ్యాఖ్య :- *ఆ విధంగా అగ్రిమెంట్ రాసిస్తారా?***

వార్త :- పీవీకి 'భారతరత్న' ఇవ్వండి. – కేంద్రానికి సిఫార్సుచేసిన రాష్ట్ర ప్రభుత్వం.
**వ్యాఖ్య :- *కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నంతవరకు అది సాధ్యం కాదులేండి.***

వార్త :- ఎన్నికలలో తెలుగోడి సత్తా చాటాలి. – తిరుపతిలో చంద్రబాబు.
**వ్యాఖ్య :- *2004, 2009లలో రెండుసార్లు చాటారు కదా... ఇంకో డోసు కూడా కావాలా?***

వార్త :- ఢిల్లీని స్థంభింపజేస్తాం. – మంత్రి టి.జి.
**వ్యాఖ్య :- *ముందు హైదరాబాద్ సంగతి చూడండి.***

వార్త :- బాల్యం నుంచే తెలుగు నేర్పాలి. – సీఎం.
**వ్యాఖ్య :- *బాల్యం నుండి నేర్పకపోబట్టే కదా మీరు చాలా అగచాట్లు పడుతున్నారు.***

వార్త :- ఉద్యోగ విధులకు కోదండరాం.
**వ్యాఖ్య :- *ఉద్యమపాఠాలు చెప్పి విద్యార్థులను ఇంకా రెచ్చగొట్టడానికా?***

వార్త :- సమైక్యమే కోరుకుంటున్నా. – కేంద్రమంత్రి కావూరి.
**వ్యాఖ్య :- *మీరు నిజంగా అలా కోరివుంటే ఎప్పుడో రాజీనామా చేసేవాళ్ళు.***

# 'దేశం' హయాంలోనే ఆసుపత్రుల అభివృద్ధి

## రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి

ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి తెలుగుదేశం పాలనలోనే జరిగిందని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాయని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడికల్స్ అసోసియేషన్ సమావేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు అధ్యక్షతన ఈ నెల 11వ తేది జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంక టేశ్వర్లురెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీ పారా మెడికల్స్, ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వ గుర్తింపు తదితర అంశాలను సాధించుకుంటే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేయడం దారుణమని, టీడీపీ అధికారంలోకి రాగానే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం పార్టీలో చేరిన ఆర్ఎంపి, పిఎంపిలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌సిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎ.వి. రమణయ్య, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నూనె మల్లిఖార్జునయాదవ్, టిఎన్‌సిపి సంయుక్త కార్యదర్శి షేక్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో నాలుగో స్థంభం జర్నలిజం

**- జిల్లా కలెక్టర్ శ్రీకాంత్**



జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న పూర్ణచంద్రరావు

నెల్లూరుజిల్లా ప్రజా పరిషత్ సమావేశ మంది రంలో ఈ నెల 11న ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ రజతోత్సవ సభ జరిగింది. సభకు ఎపిజెయు రాష్ట్ర అధ్యక్షుడు జాలె వాసుదేవనాయుడు అధ్యక్షత వహించగా నెల్లూరుజిల్లా కలెక్టర్ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో నాలుగోస్థంభంగా పిలువబడే జర్నలిజం ప్రజాస్వామ్య దేశంలో అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న నెల్లూరుజిల్లా సీనియర్ పాత్రికేయులు జె.పి.సుబ్బ రాయుడు (ఆర్.ఆర్.ఛానల్), ఎస్.అమరనారాయణ రావు(సాక్షి టి.వి), ఎ.మురళి (ప్రజాశక్తి), పి.రవిబాబు(విశాలాంధ్ర), సర్వేపల్లి రామ్మూర్తి (స్టేట్ లీడర్ పత్రిక సంపా దకులు)లకు ఆయన బెస్ట్ జర్నలిస్ట్ అవార్డులను అందించారు. ప్రముఖ పాత్రికేయులు ఎం.చలపతిరావుపై, ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయిని సావిత్రిభాయి పూలేపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు, వివిధ రంగాల్లో ఉత్తమసేవలందించిన వారికి ఎపిజెయు మరియు జగతి గ్రూప్ తరపున ఆయన జ్ఞాపికలందించారు. సభలో జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ డిప్యూటీ కమీషనర్ డా॥ వై.చైతన్యమురళి, ఏపి స్టడీసర్కిల్ డైరెక్టర్ సిద్దోజీరావు, కర్నాటక తెలుగు పాత్రికేయుల సంఘం అధ్యక్షులు మాల్యాద్రి, అఖిల భారత వార్తాపత్రికల ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు చలాది పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు.

# వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

స్వామి వివేకానందుని ఆలోచనలు, ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో స్వామి వివేకానంద శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి, జోహార్ అంటూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమాన్ని దళిత మోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి పరశురామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, మమతారెడ్డి, మురళీ, మారుతీరెడ్డి, బండారు శ్రీనివాసులు, చిలకపాటి శ్రీనివాసులు, మొగరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరం-"సమైక్య"మవ్వాలి అందరం

**- ఎస్.వి.కృష్ణప్రసాద్, 9949843105, నెల్లూరు.**

సంక్రాంతి-ఆంధ్రావనికి వెలుగుల కాంతి
సమైక్యవాదులకు కావాలి శుభోదయం-సర్వమానవాళికి అభ్యుదయం
మకరసంక్రమణ అమృతఘడియలు-నూరు కోట్ల పుణ్యఫలాలు
పెద్ద పండుగ శోభ-తెలుగింట నిండాలి ఆనంద ప్రభ
పిండివంటల ఘుమఘుమలు-ధాన్యరాశుల గలగలలు
రంగుల హరివిల్లుల రంగవల్లులు-ఇంటిముంగిట కొలువుదీరిన గొబ్బెమ్మలు
తెలుగుంటి ఆడపడుచుల సాంప్రదాయ దుస్తులు
-బొమ్మల కొలువుతో తరించే వనితలు
డూ.డూ.బసవన్నల సన్నాయినొక్కులు-హరిదాసుల సుమధుర సంకీర్తనలు
పల్లెపల్లె ముంగిట ఆనంద సంబరాలు-అంబరాన్నంటి రెపరెపలాడే పతంగులు
"అమర"మైన పితృదేవతలకు తర్పణం-జన్మజన్మల సార్థకం
ఎడ్ల పందాలు, పడవల పోటీలు-గ్రామసీమల్లో ఉత్సాహ తరంగాలు
వ్యాపారులకు కాసుల పంట-విద్యార్థులకు సెలవులతో ఊరట
చిన్నారుల కేరింతలు-కుటుంబమంతా పులకింతలు
ఉత్తరాయణ పుణ్యకాలం-ధనుర్మాస అంత్యకాలం
పొంగళ్లతో తియ్యదనం-పాడిపంటలతో కమ్మదనం
ఉవ్వెత్తున ఎగసిపడే భోగిజ్వాలలు-మళ్ళీ రావాలి "సమైక్య" సంక్రాంతులు
సంక్రాంతి లక్ష్మి పిలుపు-విభజన వాదులకు కావాలి మేలుకొలుపు....

# వివేకానందుని అడుగుజాడల్లో నడుద్దాం

నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని తెలుగు దేశంపార్టీ కార్యాలయంలో తెలుగు యువత జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వామి వివేకానంద 150వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంటేశ్వర్లురెడ్డి, తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి శింగంశెట్టి రవిచంద్ర, ఉపాధ్యక్షులు జలదంకి సుధాకర్, సమన్వయకార్యదర్శి కె.ఎస్. మోహన్, ప్రచార కార్యదర్శి కొల్లూరి బాలకృష్ణ చౌదరి, కార్యదర్శి కన్నెదార ప్రభాకర్‌నాయుడు, నగర మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఆసిఫ్‌బాషా, నెల్లూరు మురళి తదితరులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి ఊహకు అందని విధంగా పెరిగిపోయిందని, మహిళలపై అత్యాచారాలు విపరీతమైపోయాయని ఆందోళన వ్యక్తం చేసారు. వీటిలో ఎక్కువశాతం యువకులు దోషులుకావడం బాధ కలిగిస్తోందన్నారు. యువత స్వామి వివేకానందుని బాటలో పయనిస్తే ఇవన్నీ వుండవని ఆశాభావం వ్యక్తం చేసారు.

నెల్లూరు గాంధీబొమ్మ కూడలిలో తెదేపా నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెదేపా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ కన్వీనర్ కిలారి వెంకట స్వామినాయుడు, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి నూనె మల్లికార్జునయాదవ్, నేతలు సుబ్బారావు, సుధీర్ నాయుడు, హనుమంతు, బాలాజీ తదితరులు స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దోపిడీ చేస్తున్న అవినీతిపరులు, పాలకుల పీచమణచడానికి యువత నడుంకట్టాలని, నల్లధనాన్ని వెలికితీయాలని పేర్కొన్నారు.

వీఆర్‌సీ కూడలిలో తెలుగునాడు విద్యార్థి సమాఖ్య(టిఎన్ ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు, ప్రధాన కార్యదర్శి అమ్ములా దత్తుయాదవ్, సాయి కిషోర్ తదితరులు వివేకానందుని చిత్రపటానికి పుష్పమాలలు అలంకరించి నివాళులర్పించారు.

## పెద్దచెరువు నుండి కృష్ణపట్నంకు నీళ్ళు

కృష్ణపట్నంపోర్టుకు ముత్తుకూరు పెద్ద చెరువు నుంచి నీళ్ళు సరఫరా చేయడానికి నిశ్చయించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీని ప్రకారం చెరువు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేస్తున్న ట్యాంకులో నీరు నిల్వచేసి, దాన్నుంచి 1.25క్యూసెక్కుల నీటిని పోర్టుకు తరలిస్తారు. పోర్టులో ప్రత్యేకంగా నిర్మించే ట్యాంకులో ఈ నీటిని నిల్వచేసి వినియోగించుకుంటారు. సోమశిల జలాశయం నుంచి పెద్దచెరువులోకి ఒక మట్టం వరకు నీరు చేరితేనే పోర్టుకు నీరు వచ్చే అవకాశం వుంటుంది. ఆ మట్టానికి నీరు చేరకుంటే మాత్రం నీటి తరలింపు సాధ్యంకాదు. పైపులైనుకు, ట్యాంకుకు రూ.1.10కోట్లు ఖర్చును నీటిపారుదల శాఖ అంచనా వేసింది. ట్యాంకు నిర్మాణం రెండు నెలల్లో పూర్తికావచ్చని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల పోర్టుకు నీటి కొరత తీరిపోవచ్చు.

## స్టేట్‌బ్యాంకులో రెండోసారి చోరీకి విఫలయత్నం

నెల్లూరు వేదాయపాళెంలో వున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రెండోసారి చోరీకి దుండగులు విఫలయత్నం చేసారు. దాదాపు ఏడాదిన్నర క్రితం ఇదే తరహాలో దుండగులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆదివారం రాత్రి మెట్లపైనుంచి రెండవ అంతస్తుపైకి వెళ్లిన దుండగులు కిటికీ అద్దాలను పగులగొట్టారు. కిటికీ గ్రిల్స్‌ను కట్టర్‌తో కట్ చేసి లోపలికి ప్రవేశించారు. బ్యాంకు లాకరు వున్న ప్రదేశాన్ని తెలుసుకున్న దుండగులు పై అంతస్తులోని టైల్స్‌ను తొలగించారు. లాకరువున్న గదికి పైనుంచి స్లాబ్‌కు డ్రిల్ వేసి తొలగించేందుకు ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. సోమవారం ఉదయం బ్యాంకుకు వచ్చిన సిబ్బంది కిటికీ గ్రిల్స్ కోసి వుండటంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. జిల్లా ఎస్పీ పివియన్ రామకృష్ణ, ఏఎస్పీ రెడ్డి గంగాధరరావు బ్యాంకుకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. సంఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. సిఐయస్ ఇన్స్పెక్టర్లు వీరాంజనేయరెడ్డి, బాజీజాన్‌సైదా, ఐదవ నగర సిఐ ఎన్‌వి రాజశేఖరరెడ్డి చోరీ జరిగిన వివరాలను బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గతంలో పనిచేసిన బ్యాంకు సిబ్బంది, ప్రస్తుతం పనిచేస్తున్న బ్యాంకు సిబ్బంది, సెక్యూరిటీ గార్డులను పోలీసులు విచారిస్తున్నారు.

బ్యాంకులోని సిసికెమెరాలు వీడియో ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ప్రస్తుతం లభించిన వీడియో ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలను సహించం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను సహించమని, సీమాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతినేలా తెలంగాణ బిల్లు ఉందని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కలెక్టర్ కార్యాలయం ఎదుట బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పోలవరం విషయంలో సరైన స్పష్టత లేదన్నారు. భద్రాచలం డివిజన్‌ను తెలంగాణలో చేర్చడం సరికాదన్నారు. కృష్ణా మిగులు జలాల ఆధారంగా రాయలసీమలో నిర్మాణంలో వున్న హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులకు పూర్తి హామీ ఇవ్వాలన్నారు. హైదరాబాదు, పరిసర ప్రాంతాల్లోని 50లక్షల మంది సీమాంధ్ర ప్రజల భద్రతకు ప్రత్యేకబిల్లు తీసుకురావాలన్నారు. ఈమేరకు డిఆర్వో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ ఆర్థికసాయం




ఆర్థిక సహాయాన్నందజేస్తున్న డా॥ ఈదూరు సుధాకర్

కోర్టు ఆదేశాల మేరకు హెచ్ఐవి బాధితురాలికి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ సోమవారం నెల్లూరు వెంకటేశ్వరపురంలోని బాధితురాలి స్వగృహంలో రూ.55 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా డా॥ సుధాకర్ మాట్లాడుతూ బాధితురాలిని ఆదుకునేందుకుగాను ఇప్పటికే ఇల్లు, రెడ్‌క్రాస్‌లో స్వీపర్ ఉద్యోగం, అంత్యోదయ అన్నయోజన కార్డు, ప్రతి నెలా రూ.3500లు విలువచేసే మందులు అందజేశామన్నారు. కోర్టు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ఉత్తర్వుల మేరకు బాధితురాలికి ఆర్థికసహాయం అందజేసామన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం సభ్యుడు భద్రం, న్యాయవాది బ్రహ్మం పాల్గొన్నారు.

# తెలంగాణ బిల్లు, కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



టి-బిల్లును తగలబెడుతున్న టిఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు

ఆంధ్రరాష్ట్ర విభజనను నిరసిస్తూ తెలంగాణ బిల్లు ప్రతులను, కేసీఆర్ దిష్టిబొమ్మను టిఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు సోమవారం నెల్లూరు వీఆర్‌సి సెంటర్ వద్ద దహనం చేసారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు మాట్లాడుతూ సీమాంధ్రలో ఐదు నెలలుగా సమైక్యఉద్యమం జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హర్షచౌదరి, మోనూ, ప్రేంకుమార్‌రెడ్డి, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీబస్టాండ్ సెంటర్ వద్ద సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ బిల్లు నమూనా ప్రతులను దగ్ధం చేసారు. రాస్తారోకో నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. జేఏసి జిల్లా అధ్యక్షుడు డి.అంజయ్య మాట్లాడుతూ సమైక్యతీర్మానం కోసం అన్ని పార్టీలను ఏకతాటిపై నిలిపి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు.

కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు, కొందరు స్వార్థపరులు మినహాయిస్తే రాష్ట్ర ప్రజలందరూ సమైక్యాంధ్రనే కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, కిరణ్, చందు, రాయుడు, ఉమ, సుజన్ పాల్గొన్నారు.



ఈ నెల 16న నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్లో జరిగిన ఆత్మకూరు నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన డిసిసిబి చైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డిఆర్‌ఓ బి.రామిరెడ్డి, జేసీ బి.లక్ష్మీకాంతం

## నెల్లూరు కబుర్లు

# సంబరాల్లో నేతలు

సంవత్సరంలో 362రోజులపాటూ రాజకీయాలలో తలమునకలై ఉండే నాయకులు సంక్రాంతి పండుగ మూడురోజులు మాత్రం సొంత వూర్లలో సొంత ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య సరదాగా గడుపుతుంటారు. అయితే ఈ ఏడు కొందరు నాయకులు సంక్రాంతి సంబరాలకు దూరం కావాల్సి వచ్చింది. ఆనం కుటుంబంలో వరుసగా ఇద్దరు మరణించడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిలు పండుగ సంబరాలకు దూరం కావాల్సి వచ్చింది. లేదంటే వీళ్లు నెల్లూరులోనే ఉండి సంక్రాంతి పండుగను ఎంతో ఘనంగా జరుపుకునేవాళ్లు. వివేకా అయితే చెరువులో పడవ పందేలు, ఆటలపోటీలు వంటివి పెట్టి ఎంతో హుషారుగా ఉండేవాడు. సంక్రాంతి పండుగ రోజున తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తల్లి చనిపోయారు. దీంతో ఆయన ఇంటా సంక్రాంతి పండుగ లేకుండా పోయింది.

ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా బీజేపీ నాయకులు యం.వెంకయ్యనాయుడు స్వగ్రామం లోనూ, నెల్లూరులోనూ సంక్రాంతి వేడుకలలో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మిగతా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

ప్రతియేటా కూడా సిపిఎం పార్టీ వారు సంక్రాంతి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈసారి శ్రీహరినగర్, హరనాథపురంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలపోటీలు జరిగాయి.

# దత్తత పాఠశాలకు ఉత్తమసేవలందిస్తున్న రోటరీక్లబ్



నెల్లూరు గాంధీ నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఈ నెల 11న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పర్యా వరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్య క్రమం జరిగింది. పాఠ శాల ఆవరణలో జామ, మామిడి, నేరేడు తదితర మొక్కలను రొటేరియన్ కె.హుస్సేన్ సౌజన్యంలో నాటారు. రోటరీక్లబ్ ఈ పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థులకు ఇది వరకు 80డ్యూయల్‌డస్కులు పంపిణీ చేసివున్నారు. ప్రస్తుత సందర్భంలో రొటేరియన్ పి.వెంకటేశ్వర్లు వితరణతో 150స్టీలు పళ్ళాలు పంపిణీ చేసారు. త్వరలో విద్యార్థులకు మెరుగైన మరుగుదొడ్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శేఖర్, కె.ప్రతాప్‌కుమార్‌లు తెలిపారు.

కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్.రాఘవేంద్రషెట్టి, రొటేరియన్స్ పి.శ్రీనివాసులురెడ్డి, ఖాజాహుస్సేన్, వెంకటేశ్వర్లు, డాక్టర్ దొరస్వామినాయుడు, రామకృష్ణారెడ్డి, మధుసూదన్‌రావు, కె.వి.సుబ్బారెడ్డి, దయానంద్, విజయరామిరెడ్డి, నారాయణ, జయప్రకాష్, సనత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వెన్నదొంగకు పాయసం నివేదన



నెల్లూరు నగరంలోని రాయాజీవీధి శ్రీఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 11వతేది ఉదయం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణునికి 108 గంగళాల పాయసంతో నివేదన పూజలు నిర్వహించారు. తిరుప్పావై ప్రవచకులు డాక్టర్ రామచంద్రుని రమేష్‌కృష్ణ ఆధ్యర్యంలో ఈ మహోత్సవం వైభంగా జరిగింది. నెల రోజుల పాటు నిర్విఘ్నంగా, దిగ్విజయంగా తిరుప్పావై ప్రవచనాలను రమేష్‌కృష్ణ భక్తులకు వివరించారు. ధనుర్మాసం సందర్భంగా ఈ మహోత్సవాన్ని నిర్వహించారు.

## ముసవ్వీర్ మరో అద్భుతం...

# సూక్ష్మ అయ్యప్పస్వామి విగ్రహం, మెట్లు నమూనా

నెల్లూరు నగరం జెండావీధి చెందిన సూక్ష్మ స్వర్ణకారుడు షేక్‌ముసవ్వీర్ మరో అద్భుతాన్ని రూపొందించాడు. గతంలో అన్ని మతాలకు సంబంధించిన పండుగలకు సంబంధించిన వివిధ దేవతామూర్తుల విగ్రహాలను బంగారం వెండితో సూక్ష్మంగా తయారు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప జ్యోతిని పురస్కరించుకుని స్వామి వారి విగ్రహాన్ని 200మి.గ్రా బంగారంతో, అయ్యప్ప మందిరాన్ని 18 మెట్లు, దీక్షలు తీసుకున్న స్వాములను 6 గ్రాముల వెండితో రూపొందించి ప్రదర్శించాడు. ఈ సందర్భంగా ముసవ్వీర్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు కష్టపడి 6సెంమీ ఎత్తు 4 సెంమీ వెడల్పుతో సూక్ష్మ నమూనాను ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

# సందడే...సందడి

భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని ఏ ప్రాంతంలో చూసినా ఈనెల11 నుండి సందడి వాతావరణంతో రోడ్లన్నీ కిక్కిరిసాయి. బంగారు, వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లాలోని చుట్టు ప్రక్కల గ్రామాల్లోని ప్రజలు పండగ సందర్భంగా నగరానికి తరలివచ్చారు. ట్రంకురోడ్డు, కాపువీధి, చిన్నబజార్, సండేమార్కెట్టు తదితర ప్రాంతాల వద్ద జనంతో కిటకిటలాడింది. వివిధ రకాల కొనుగోళ్ళు చేసేవారితే నెల్లూరు నగరం శోభాయమానంగా మారింది. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్, ములుమూడి బస్టాండ్‌ల వద్ద జనంతో కోలాహలం నెలకొంది.

# టిక్కెట్లకు కట.. కట...

భోగి, పెద్ద పండుగ సందర్భంగా నెల్లూరు జిల్లా నుండి ఊర్లకు వెళ్ళే ప్రయాణీకులతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడాయి. ఈనెల 11, 12 తేదీల్లో పండుగ సెలవులు రావడంతో చాలా మంది తమ స్వస్థలాలకు బయలుదేరారు.

రైళ్ళు, బస్సుల్లో ఎక్కేందుకు జనాలు పోటీపడ్డారు. రవాణాశాఖ దాడులతో ప్రైవేట్‌బస్సులు తక్కువ కావడంతో హైదరాబాద్ బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్ళేవారితో ఆర్టీసీ బస్సులకు తీవ్రమైన రద్దీ ఏర్పడింది. రిజర్వేషన్ కౌంటర్ వద్ద తత్కాల్ టిక్కెట్లు కోసం గంటల తరబడి నిలబడ్డారు. 16వతేదీ సెలవలు ముగియడంతో బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాల నుండి వచ్చిన నెల్లూరీయుల తిరుగు ప్రయాణంతో రద్దీ నెలకొంది.

# పాలధర పెరిగింది

అన్ని రకాల నిత్యావసరధరలు పెరిగి పేద మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతుంటే, సంక్రాంతి కానుకగా పాలధరనూ పెంచి ప్రజల నెత్తిన భారం మోపారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రైవేటు డెయిరీలు ధరను పెంచేసాయి. ప్రభుత్వరంగసంస్థ విజయడెయిరీ ఈ నెల 17వ తేదీ నుంచి పెంచే అవకాశాలున్నాయి. లీటరుకు రెండురూపాయలు పెంచడంతో నెల్లూరు జిల్లా వాసులపై అదనంగా నెలకు రూ.42 లక్షలు భారం పడనుంది. పాలప్యాకెట్లను ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే వినియోగిస్తున్నారు. రోజుకు లీటరు పాలు వాడేవారు ఇకపై నెలకు అదనంగా రూ.60లు వెచ్చించాల్సివుంది.

# వైభవంగా గోదా రంగనాథుల కళ్యాణోత్సవం



నెల్లూరునగరం రాయాజి వీధిలోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో మంగళ వారం ఉదయం గోదా రంగనాధులకు దివ్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గత నెల రోజులుగా తిరుప్పావై ప్రవచనాలను హిందూధర్మ ప్రచార మండలి సభ్యులు డాక్టర్ రామచంద్రుని రమేష్‌కృష్ణ నిర్విఘ్నంగా ప్రవచించారు. ప్రవచనాల కార్యక్రమం మంగళవారంతో పూర్తయిన సందర్భంగా రమేష్‌కృష్ణ ప్రసంగిస్తూ గోదా కల్యాణం లోకల్యాణం కోసం జరిగిన పండుగని, పరమాత్మను కలిసి భోగాలను అనుభవించిన రోజు గనుక అది 'భోగి' అయిందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తిరుమలతిరుపతి దేవస్థానము వారి ఆళ్వార్ దివ్యప్రభంద ప్రాజెక్టు తరపున నిర్వహించిన తిరుప్పావై ప్రవచనములకు ఈ దేవస్థానం వేదిక కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తిరుప్పావై ప్రవచకులు డాక్టర్ రామచంద్రుని రమేష్‌కృష్ణను ఆలయ కార్యనిర్వహణాధికారి వేద పండితులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు లతాభవాని, రేవతి, సుబ్బలక్ష్మి, శైలజ చంద్రశేఖరం, భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేసారు.

# జైళ్ల శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం

నెల్లూరుజిల్లా జైలులో ఈ నెల 12న జైళ్ళశాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టి.అనంత్‌రావు అధ్యక్షులు, ఎం.వెంకయ్య ఉపాధ్యక్షులు, పి.చెంచయ్య ప్రధానకార్యదర్శి, కిష్టఫర్ కార్యదర్శి, లక్ష్మీనారాయణ నిర్వహణకార్యదర్శి, వెంకయ్య కోశాధికారి, శ్రీనివాసులు, నరసయ్య, మురళి, ఖాదర్‌బాషా, సుబ్బారావు, దాదుబాషా, బాబయ్యలు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

# కొనలేం...తినలేం...బతకలేం

## తెలుగు మహిళల వినూత్న నిరసన

కాంగ్రెస్ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజాలు ఏదీ కొనలేక, తినలేక, బతకలేక, అవస్థలు పడుతున్నారని నిత్యావసర సరుకులు గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అంచెల వాణి తీవ్రంగా విమర్శించారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేది వినూత్న నిరసనను తెలిపారు. అరిసెలు, లడ్లు తదితరాలను ప్యాకెట్లలో ఉంచి మహిళలు బైటాయించారు. ఈ సందర్భంగా అంచెలవాణి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అధిక ధరల స్థిరీకరణ కోసం రూ.500 కోట్లు నిధిని కేటాయించారని, ధరలన్నీ అందుబాటులో ఉండేవన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సూర్యకుమారి, గూడూరు డివిజన్ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, తెలుగు మహిళ కోవూరు నియోజకవర్గ అధ్యక్షురాలు సుజన, రవణమ్మ, చంద్రసేన, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటికి రంగడి ఆదాయం రూ.2.06లక్షలు

ముక్కోటి పర్వదినాన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హుండీలను ఈ నెల 12న లెక్కించారు. రూ.2.06లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా సహాయకమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శైలేంద్ర, సుధాకర్, రమణ, ధర్మకర్తల మండలి చైర్మెన్ దుగ్గిశెట్టి భారతి తదితరులు పాల్గొన్నారు.




## తెలుగుజాతి గర్వించే ప్రపంచస్థాయి నిర్మాణం... విమానయాన రంగంలో అరుదైన అద్భుతాల తోరణం...

# GVK సుందర సౌధం...!

## నెల్లూరీయుడిచే ముంబై విమానాశ్రయంలో ఆవిష్కరణం

***అద్భుత కళాఖండాలు, అపురూప ఆకర్షణలు, అంగుళం అంగుళం భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింపజేస్తూ అంతర్జాతీయ ప్రయాణీకులను ముగ్ధులను చేసే స్థాయిలో అత్యంత అధునాతనంగా అందమైన కళాసృష్టిగా రూపొందించబడిన ముంబైలోని ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-2ని భారత ప్రధాని డా॥ మన్మోహన్‌సింగ్ జనవరి 10వ తేదీ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.***


ప్రతి భారతీయుడు గర్వించే స్థాయిలో భారతీయ కళాఖండాలను ఆకట్టుకునే స్థాయిలో ఏర్పాటుచేసి భారతదేశ సంప్రదాయాలను దేశదేశాల ప్రయాణీకులకు చాటిచెప్పాలన్న జివికె రెడ్డి, ఆయన కుమారుడు జి.వి.సంజయ్‌రెడ్డిల ప్రయత్నం విజయవంతమైంది. భారతదేశ విమాన ప్రయాణీకులకు ఒక మణిహారం లాంటి విమానాశ్రయాన్ని అందించాలన్న వారి కల ఫలించింది.

విమాన ప్రయాణీకులు కేవలం రాకపోకలకు వినియోగించే ప్రయాణ కేంద్రంలా కాకుండా ముంబై విమానాశ్రయాన్ని ప్రతి భారతీయుడు చూసితీరాలన్న రీతిలో ఒక విహారయాత్ర స్థలంగా తీర్చిదిద్దారు.

న్యూయార్క్, కౌలాలంపూర్, సింగపూర్ వంటి అంతర్జాతీయ విమానాశ్రయాలను చూసినప్పుడు ఇలాంటి ఎయిర్‌పోర్ట్‌లు మన దేశంలోకి ఎప్పుడొస్తాయా? ఎన్నేళ్లకొస్తాయా? అని భారతీయులు మదనపడేవాళ్లు. అంతటి అద్భుతమైన ఎయిర్‌పోర్టులు మన దేశంలో నిర్మించడం ఒక కలగానే భ్రమపడేవాళ్లు. కాని ఆ కలలను సాకారం చేయడానికి దశాబ్దాలు పట్టలేదు, ఏళ్లకాలం గడవలేదు. అసాధ్యమనుకున్న ఆ సుందర స్వప్నాన్ని జివికె సాధ్యం చేసారు. ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఎయిర్‌పోర్ట్‌ను ఈరోజు మన కళ్లముందు సాక్షాత్కరింపజేసారు. **(మిగతా 10వ పేజీలో)**

### టెర్మినల్ 2 ఆకర్షణలు - ప్రత్యేకతలు

- 4.4 మిలియన్ల చదరపు అడుగులలో 5,200కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మాణం.
- దాదాపు 11,000మంది ఒకేసారి కూర్చోగలిగిన విధంగా 161 ఎలివేటర్లు, ఎస్కలేటర్లు, ట్రావెలేటర్లను ఏర్పాటు చేసారు.
- గంటకు 9600 బ్యాగులను ప్రయాణీకులకు చేర్చడానికి పూర్తిగా ఆటోమేటిక్ వ్యాండిలింగ్ విధానంలో 10బ్యాగేజి బెల్టుల ఏర్పాటు, మరో 4ఏర్పాటు చేయడానికి సన్నాహాలు.
- 90%మందికి ఎయిరో బిడ్జీల ద్వారానే సేవలు అందించడానికి వీలుగా 52బోర్డింగ్ బ్రిడ్జిల ఏర్పాటు.
- విమానాల రద్దీ సమయంలో ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన వారికి సేవలందించే విధంగా ప్రణాళిక.
- 208 చెక్‌ఇన్ కౌంటర్స్‌తో పాటు, 23 జాతీయ, 30 అంతర్జాతీయ సెక్యూరిటీ గేట్లు.
- ఈ విమానాశ్రయాన్ని త్వరితగతిన చేరుకోవడానికి 3.2 కిలో మీటర్ల ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవేని నిర్మించి వెస్టరన్ హైవేకి అనుసంధానం చేసారు.



Chhatrapati Shivaji
INTERNATIONAL AIRPORT
MUMBAI

GVK




# Welcome to Terminal 2, Mumbai.

## A new global landmark and pride of India.

### Inaugurated by Dr. Manmohan Singh, Hon'ble Prime Minister of India

T2 stands as a testimony to our commitment at GVK to deliver this vision and celebrate India. The terminal not only presents the richness and diversity of India to the world but is also a combination of inspired architectural design and functionality to grant every passenger an exclusive experience that is enchanting, engaging and essentially Indian. Every part of T2 reflects a commitment to make it a modern iconic destination that sets global benchmarks in airports.

- 40 million passengers per annum
- Over 2,10,000 sq ft retail area
- Over 50,000 sq ft landscape area
- 188 check-in counters
- 60 immigration & 72 emmigration counters
- 124 security check positions
- 52 boarding bridges
- A 6 lane elevated express way
- Multi-level car park for over 5,000 cars


Dr. Manmohan Singh
Hon'ble Prime Minister of India



Shri Kateekal Sankaranarayanan
Hon'ble Governor of Maharashtra


Shri Prithviraj Chavan
Hon'ble Chief Minister of Maharashtra


Shri Ajit Singh
Hon'ble Union Minister for Civil Aviation


Shri Sharad Pawar
Hon'ble Union Minister for Agriculture, Food Processing Industries


Shri Praful Patel
Hon'ble Union Minister for Heavy Industries and Public Enterprises



Shri Ajit Anantrao Pawar
Hon'ble Deputy Chief Minister of Maharashtra


Shri K C Venugopal
Hon'ble Union Minister of State for Civil Aviation


Shri Sunil Waman Prabhu
Mayor of Mumbai



Dr. GVK Reddy
Executive Chairman
Mumbai International Airport Private Limited


Energy


Resources


Airports


Transportation


Hospitality


Life Sciences


CSR

GVK

OTS:GVKT2:1701:14






## ఆశ్చర్యం గొలిపే వాస్తవాలు

- 15మీటర్ల ఎత్తులో కేబుల్ సహాయంతో ఏర్పాటు చేసిన అద్దంగోడ(గ్లాస్‌వాల్) ప్రపంచంలోనే అతి పెద్దది.
- 11యకరాలలో నిర్మించిన స్ట్రక్చర్‌లో కేవలం 30 కాలమ్స్‌ని మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం.
- 1.85 మిలియన్ల గ్రానైట్‌ను ఫ్లోరింగ్ కొరకు వినియోగించారు.
- 30,000 చదరపు అడుగుల రూఫ్‌గ్లాస్ ద్వారా సూర్యకాంతి విమానాశ్రయంలో ప్రసరించేలా నిర్మాణం.
- ముఖ ఆకర్షణ కోసం 4కిలోమీటర్ల నిడివికలిగిన యల్ఇడి లైట్ల వినియోగం
- 5200 కార్లు పార్కింగ్ కోసం భారతదేశంలోనే అతిపెద్ద పార్కింగ్ వసతి ఏర్పాటు.











### ప్రత్యేకత చాటిన డిజైన్...

ఈ ఎయిర్‌పోర్టును డిజైన్ చేసింది అమెరికాకు చెందిన 'స్కిడ్‌మోర్ ఓయింగ్స్ అండ్ మెరిల్' అనే సంస్థ. అయితే ఓ పట్టాన వారి డిజైన్‌లను జివికె అంగీకరించలేదు. ఆ సంస్థ ఎన్నో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులకు డిజైన్ చేసింది. కాని ముంబై ఎయిర్‌పోర్ట్ డిజైన్‌ను మాత్రం భారతీయుల మనసుకు దగ్గరగా వుండేలా రూపొందించాలనుకున్నారు జివికె. అందుకే ఆ సంస్థ ప్రతినిధులు నెలరోజుల పాటూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో పర్యటించారు. ఆయా రాష్ట్రాల సంస్కృతులను, కళాకృతులను పరిశీలించారు. కాబట్టే భారతదేశంలోని అన్ని ప్రాంతాల సంస్కృతిని కళారూపాలను తెచ్చి ఇక్కడే పేర్చిపెట్టారు.






ఇప్పుడు ముంబై ఎయిర్‌పోర్ట్‌లో భారత దేశంలోని ఏ రాష్ట్రం వాళ్లు అడుగుపెట్టినా, తమ సొంత రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టులో అడుగు పెట్టిన అనుభూతి కలగజేయడం ఈ ఎయిర్ పోర్టు ప్రత్యేకత.





### తండ్రికి మించిన తనయుడు...


తండ్రుల ఆస్థుల కోసం, వారి పదవుల కోసం వారసులు పోటీ పడుతున్న కాలమిది. కాని జివికె తనయుడు సంజయ్ తండ్రిలోని పట్టుదలను, అంకితభావాన్ని, కష్టాన్ని ప్రేమించే తత్వాన్ని వారసత్వంగా పుణికిపుచ్చుకున్నాడు. ముంబై ఎయిర్‌పోర్టును ఇంత అద్భుతంగా తీర్చిదిద్దడం వెనుక ప్రధానపాత్ర సంజయ్‌దే! ఎంత ఖర్చుకైనా వెనుకాడకుండా ఈ ఎయిర్‌పోర్టును ఒక కళాఖండంగా రూపొందించిన సంజయ్ సదా అభినందనీయుడు.

### నెల్లూరీయులుగా గర్విద్దాం...

ప్రపంచంలో ఏ అగ్రశ్రేణి ఎయిర్‌పోర్టుకు తీసిపోని విధంగా, అద్భుత విమానాశ్రయాలనుకుంటున్న వాటిని తలదన్నే రీతిలో ముంబై ఎయిర్‌పోర్టును నిర్మించింది తెలుగువాడంటే మన రాష్ట్రం వాళ్లంతా గర్వపడతారు. అదే నెల్లూరీయుడంటే ఈ జిల్లా వాసులుగా మనం ఇంకెంత గర్వపడాలి. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో పుట్టి పారిశ్రామిక రంగంలో చెరగని ముద్రవేసి, ఏ రంగంలోనైనా నాణ్యతకు, నమ్మకానికి చిరునామాగా నిలుస్తూ, మొన్న బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో, నేడు ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంతో ప్రపంచంలోనే అత్యంత సుందరమైన ఎయిర్ పోర్టులను రూపొందించగల సత్తా తమకు వుందని చాటిన తండ్రీ కొడుకులకు 'లాయర్' అభినందనలు.



సింహపురి సమాచారం

# చింతాపై చిటపట

## కార్యకర్తలకు మండుతుంది




ఆయనకు ఎవరన్నా లెక్కలేదు. ఎవరితో మర్యాదగా మాట్లాడడు. ఎవరినీ పట్టించుకోడు. ముఖ్యంగా కాంగ్రెస్ కార్యకర్తలతో సంబంధాలు లేవు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎంపీగా ఎన్నికైన ఆయనకంటే కూడా అధిష్ఠానం ఎంపిక చేసిన రాజ్యసభ సభ్యుడే నయమనిపించింది. అంతగా ఆయన ప్రజలకు ముఖ్యంగా కాంగ్రెస్ కార్యకర్తలకు దూరమయ్యారు. అందుకే మరోసారి ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ కాంగ్రెస్ కార్యకర్తలు అధిష్ఠానం పంపిన పరిశీలకుల ముందే ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం జరిగింది.

తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై నేతలు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఇటీవల అధిష్ఠానం దూతగా కర్నాటక ఎమ్మెల్సీ ఆర్.వి.వెంకటేష్ నెల్లూరు రావడం జరిగింది. మంత్రి, ఎమ్మెల్యే స్థాయి నాయకులు రాలేకపోయినా ద్వితీయశ్రేణి నాయకులు నెల్లూరులోని ఇందిరాభవన్‌కు వచ్చి తమ అభిప్రాయాలను వెల్లడించారు. చింతా మోహన్‌కు ఇంకోసారి టిక్కెట్ ఇవ్వొద్దని కార్యకర్తలు కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. చింతా మోహన్ ఎంపీగా ఈ నాలుగున్నరేళ్లలో పొడిచిందేమీ లేదు.

తిరుపతి పార్లమెంట్ పరిధిలో మన జిల్లాకు చెందినవే వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, సర్వేపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. ఈ నాలుగున్నరేళ్లలో ఆయన ఏనాడూ ఈ నియోజకవర్గాలలోని కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమైంది లేదు. వారి మంచి చెడ్డలు తెలుసుకున్న దాఖలాలు లేవు. ఇక కార్యకర్తలకు ఆయన పట్ల సానుకూల ధోరణి ఎలా ఉంటుంది. జిల్లాలో జరిగిన కాంగ్రెస్ కార్యక్రమాలలో కూడా ఆయన పెద్దగా పాల్గొన్నది లేదు. కాబట్టి ఆయనకు సీటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చింతా కంటే కొత్త వారికే టిక్కెట్ ఇవ్వడం మేలని కార్యకర్తల అభిప్రాయం.

# ఎన్నికలు సమైక్యాంధ్రలోనే జరుగుతాయి

## నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఆత్మకూరు మండలం బొమ్మవరం అగ్రహారంలో వైయస్సార్సీపీ ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి గౌతంరెడ్డి ఈ నెల 13న పాదయాత్ర చేసారు. యాత్రలో పాల్గొన్న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమైక్యరాష్ట్రంలోనే జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజనకు నిర్ణయించిన కాంగ్రెస్ సీమాంధ్రలో భూస్థాపితం అయిందని, ఉత్తుత్తి వాగ్దానాలు చేస్తూ చంద్రబాబునాయుడు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి జీవించి వుంటే ఇన్ని అనర్థాలు జరిగేవి కావని, రాష్ట్రం కష్టాల్లో పడేది కాదని అన్నారు. వైయస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధాప్యపింఛన్ రూ.200 నుంచి రూ.500కి పెంచుతామని, ప్రతి పేదవానికి పక్కా ఇల్లు నిర్మిస్తామని తెలిపారు. వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో మన రాష్ట్రంలో 47లక్షల పక్కా ఇళ్ళ నిర్మాణం జరిగితే, దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కలిపి 47లక్షల ఇళ్లు నిర్మించారన్నారు. అందుకే జగన్మోహన్‌రెడ్డి సిఎం అయితేనే ప్రజల కష్టాలు తొలగిపోతాయన్నారు.

కార్యక్రమంలో వైయస్సార్సీపీ సీఈసీ సభ్యుడు, మాజీఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, అనంతసాగరం మండలం కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, నేతలు అల్లారెడ్డి సతీష్‌రెడ్డి, బిజివేముల వెంకటసుబ్బారెడ్డి, ఇందూరు శేషారెడ్డి, హజరత్‌బాబు, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, బట్టెడ్డి చక్రధర్‌రెడ్డి, మందా రామచంద్రారెడ్డి తూమాటి దయాకర్‌రెడ్డి, ఎద్దుల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమరాజ్యం.. జగనన్నకే సాధ్యం!

## - వైయస్సార్సీపి నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరురూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 11వ తేదీన దళిత పోరాట సమితి విస్తృత కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దివంగత మహానేత వై.యస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం సాగిందని, రాజన్న మరణం తర్వాత సంక్షేమ పథకాలు కోతకు గురయ్యాయన్నారు. ఆర్టిసి, కరెంటుతో సహా అన్ని రకాల ఛార్జీలు పెరిగాయని, 44వేల కోట్ల పన్నుల భారాన్ని ప్రజలపై వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నీరుగారుస్తుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రాయితీ పథకం, పేదవాడికి పక్కా ఇల్లు ఇలాంటి మరెన్నో పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడిందని పేర్కొన్నారు. ముఖ్యంగా వై.యస్.రాజశేఖర్‌రెడ్డి దళితుల కోసం యస్సీ కార్పొరేషన్‌లో రుణాలు మాఫీ చేశారని, పేదలకు భూపంపిణీ, ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు పథకం ప్రవేశపెట్టాడని అన్నారు. మళ్లీ రాజన్న సంక్షేమ రాజ్యం రావాలంటే మరో మూడు నెలల్లో ఎన్నికలు జరుగబోతున్నాయని, ఆ ఎన్నికల్లో రాజన్నబిడ్డ జగనన్నకు ఓటు వేసి ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెడితే మళ్ళీ రాజన్న పాలన వస్తుందని ఆరోజు సంక్షేమ పథకాలతో సామాన్యుడి రాజ్యం వస్తుందని కోటంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డిని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో దళితపోరాట సమితి అధ్యక్షులు మందా బాబ్జి, జంగాల గోపాలరావు, చెంచురామయ్య, నరసింహులు, కార్యదర్శి మందా పెద్దబాబు, పంట్రంగి అజయ్, బద్దెపూడి మణి, పోట్లూరి రమణయ్య, నిత్యానంద్, ఏడుకొండలు, తాళ్ళూరు సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 11వ తేదీన పక్షులపండుగ సందర్భంగా నేలపట్టులో నిర్వహించిన పాముల ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణ, పక్కన జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎమ్మెల్యే పరసారత్నం తదితరులు

# స్వర్ణభారత్‌లో సంక్రాంతి శోభ



ప్రదర్శనలో వస్తువులను పరిశీలిస్తున్న వెంకయ్యనాయుడు

అయా సేవాకార్యక్రమాలతోను, ఇటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలోనూ తనదైన ముద్రను వేసుకుంటున్న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రతిఏటా ఆనవాయితీగా సంక్రాంతి సంబరాలను జరుపుతుంటారు. ఈ పరంపరలో భాగంగా నెల 11వతేదీన స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో సంక్రాంతి వేడుకలను, అలాగే స్వర్ణభారత్ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ పదో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ట్రస్ట్ ప్రాంగణాన్ని ముగ్గులతో అలంకరించారు. ఆరోజు ఉదయం నిర్వహించిన ముగ్గులపోటీలకు పెద్దసంఖ్యలో మహిళలు విచ్చేసారు. ఈ సందర్భంగా జరిగిన సంక్రాంతి సంబరాలలో బీజేపీ జాతీయ నాయకులు ఎం.వెంకయ్యానాయుడు, ఆంధ్రాబ్యాంకు ఛైర్మెన్ రాజేంద్రన్, సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఛైర్మెన్ సుచిత్ర ఎల్లా, శ్రీసిటి ఛైర్మెన్ రవిసన్నారెడ్డి, ముంబై ఐటీఎం విశ్వవిద్యాలయ ఫౌండర్, ఛాన్సలర్ పి.వి.రమణ, ప్రముఖ రచయిత మీగడ రామలింగస్వామి, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మెన్ మాగంటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ సంబరాలను ఉత్సాహవంతంగా నిర్వహించడంలో చురుకైన పాత్ర పోషించారు.

# మోడీతో ట్రిబుల్‌సెంచరీ ఖాయం - యం.వెంకయ్యనాయుడు



రానున్న పార్లమెంటు ఎన్నికల సంగ్రామం అనే క్రికెట్ క్రీడలో కాంగ్రెస్ క్రికెట్ జట్టుపై నరేంద్రమోడీ కెప్టెన్సీలో బీజేపీ జట్టు 300 పరుగులు(మూడు సెంచరీలు-300సీట్లు) సాధించి విజేతగా నిలుస్తుందని భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. భారతీయ జనతా యువమోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు "ఖేలేంగే యువ - జీతేంగే భారత్" కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని విఆర్ కళాశాల మైదానంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి టోర్నమెంటును సోమవారం వెంకయ్యానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు, ఓటమి కంటే క్రీడాస్ఫూర్తి అవసరమన్నారు. యువతకు క్రీడలపై ఆసక్తి కల్పించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో దేశవ్యాప్తంగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు యస్.విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మొగరాల సురేష్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కామాక్షితాయి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వేంచేసియున్న శ్రీ కామాక్షితాయి సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయ పాలకమండలి సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. జక్కంరెడ్డి సుబ్బారెడ్డి, పత్తి చంద్రశేఖరరెడ్డి, ఎ.చంద్రశేఖరరెడ్డి, ఆదూరు పూర్ణచంద్రరావు, నెల్లెంబాక మోహన్, సూరిశెట్టి శ్రీనివాసులు, బి.హరనాథ్, డాక్టర్ గంగపట్నం మురళీ, రాజేశ్వరమ్మ, ఎక్స్‌అఫిషియో మెంబరుగా వారణాసి శివగంగా ప్రసాద్‌తో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. పాలకమండలి అధ్యక్షుడి ఎన్నికను వాయిదా వేశారు.

# నేత్ర పర్వంగా అయ్యప్ప మకర జ్యోతి దర్శనం

నెల్లూరు వేదాయపాళెంలో వేంచేసియున్న స్వామి అయ్యప్ప దేవస్థానంలో ఈ నెల 14వతేది సాయంత్రం మకర జ్యోతిగా అయ్యప్ప భక్తులకు దర్శనమిచ్చారు. శబరిమలైలో జ్యోతి దర్శనం అయిన వెంటనే ఇక్కడ మకరజ్యోతి దివ్య దర్శనం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు రాజీవ్‌నంబూద్రి ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చక బృందాలు అయ్యప్ప స్వామికి కర్పూరనీరాజనం సమర్పించిన అనంతరం హారతిని ఆలయ శిఖరంపైకి తీసుకువచ్చి అక్కడ కర్పూరాన్ని వెలిగించారు. భక్తులు స్వామియే శరణమయ్యప్పా అంటూ జ్యోతిని దర్శించుకున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# సీమాంధ్ర, తెలంగాణ మధ్య సంక్రాంతి పందేలు

శ్రీను గల్పిక 989

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ భవనం.... తెలంగాణ బిల్లుపై ఆరోజు చర్చ జరుగుతుంది. దీంతో ఇటు సీమాంధ్ర, అటు తెలంగాణ ఎమ్మెల్యేలు ఎవరి ఏర్పాట్లతో వాళ్లు రాసాగారు. కొందరి చేతుల్లో కర్రలు, ఇంకొందరి చేతుల్లో కత్తులు, మరికొందరి చేతుల్లో రాడ్లు... ఇలా ఎవరి ఆయుధాలతో వాళ్లు వచ్చారు. సభాపతి స్థానంలో నాదెండ్ల మనోహర్ కూర్చుని... ఇక సభను ప్రారంభించండి అని ఆదేశించారు. వెంటనే హరీష్‌రావు చేతిలో కర్రతో లేచి పోడియం ముందుకు వెళ్లి... చేతిలో కర్రను అటు ఇటు గిరగిర తిప్పుతూ కర్రసాము విద్యను ప్రదర్శించాడు. వెంటనే సీమాంధ్ర వైపు నుండి టి.జి. వెంకటేష్ లేచి పోడియం ముందుకు వెళ్లి.. కాంతారావు లెవల్లో కత్తి తిప్పి కూర్చున్నాడు. ఈ ప్రదర్శనలు చూసి స్పీకర్ నాదెండ్లకు మతిపోయింది. చర్చను ప్రారంభించమంటే మీరేంటి మారణాయుధాలతో విద్యలు ప్రదర్శిస్తున్నారని అడిగాడు. అప్పుడు ఈటెల రాజేందర్ లేచి... చర్చ అంటే మాట్లాడేదేముంటుంది సార్, పోట్లాడుకునేదేకదా, అందుకే మా ఏర్పాట్లలో మేమొచ్చాం అని చెప్పాడు. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఉండి... మేం శాంతికాముకులం... మాది గాంధీగిరి అహింసావాదం... ఈ కొట్లాటలు, పోట్లాటలు మాకు అవసరం లేదు. ఏదన్నా ఉంటే శాంతియుతంగా తేల్చుకుందామన్నాడు. వెంటనే నాగం జనార్ధన్‌రెడ్డి లేచి... మేం మాత్రం రౌడీలమా... గూండాయిజం కోర్సుల్లో డిగ్రీలేమన్నా తీసుకున్నామా... కాకపోతే అవసరానికి పనికొస్తాయని కర్రలు, కత్తులు తెచ్చుకున్నామన్నాడు. అప్పుడే బొత్స సత్యనారాయణ లేచి... తెలంగాణ బిల్లు మీద మనం ఎన్నిరోజులు చర్చలు జరిపినా తెగేది లేదు, తెల్లారేదీ లేదు. అరచి అరచి మన నోళ్లు నొప్పి పుట్టాల్సిందే! మనం కొట్టుకున్న దాని వల్ల ఎవరికీ ఉపయోగం లేదు. దీనికంటే కూడా సీమాంధ్ర, తెలంగాణల మధ్య కొన్ని సంక్రాంతి పందేలు పెట్టుకుందాం. ఎలాగూ ఇప్పుడు సంక్రాంతి పండుగ కాబట్టి మనం కూడా సంక్రాంతి వేడుకలు చేసుకున్నట్లుంటుంది. ఈ సంక్రాంతి పందేలలో మేం గెలిచామంటే మీరు ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను వదులుకోవాలి... మేం ఓడిపోయామంటే తెలంగాణబిల్లుకు ఏకపక్షంగా మద్దతు పలుకుతామని చెప్పాడు. మరి పందేలు ఏంటని కడియం శ్రీహరి అడిగాడు. అప్పుడు బొత్స... గుర్రం రేస్ పెడదాం, మా తరపున జాకీగా స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి వుంటాడు, మీ తరపున జాకీ ఎవరని అడిగాడు. వెంటనే హరీష్‌రావు నేనుంటానని ముందుకొచ్చాడు. ఓకే శెహభాష్ అంటూ బొత్సనే మళ్ళీ అందుకుని... అలాగే ఇరు ప్రాంతాల మధ్య కోడి పందేలు, పొట్టేలు పందేలు కూడా ఉంటాయి. ఈ మూడు పందేలలో రెండు లేదా మూడు పందేలు ఎవరు గెలుస్తారో వారే విజేతలని చెప్పాడు. ఇరు ప్రాంతాలనేతలు దానికి అంగీకరించారు.

★★★★★

సీమాంధ్ర ఎమ్మెల్యేలంతా కిరణ్ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. కిరణ్ ఉండి... ఈ పందేలు నాకు అలవాటులేని పని... ఎలా చేద్దామంటారు అని అడిగాడు. వెంటనే బొత్స ఉండి... మాకు రోజూ అదేపనా? పందేలకు మేమూ కొత్తే... కాకపోతే అసెంబ్లీలో మనం తన్నుకోవడం కంటే, కోళ్ళు, పొట్టేళ్లు తన్నుకుంటే సులభం కదా. వాటితోనే ఈ సమస్యను పరిష్కరించవచ్చునుకుని ఈ పందేలు పెట్టానన్నాడు. మరి ఈ పందేలలో సీమాంధ్రను గెలిపించాల్సిన బాధ్యతను ఎవరు తీసుకుంటారని శైలజానాథ్ అడిగాడు. అప్పుడు సీనియర్ నేత గాదె వెంకటరెడ్డి లేచి... వీరాధివీరుడు, అజేయపరాక్రమవంతుడు, అసహాయసూరుడు, సీమాంధ్ర మగధీరుడు శ్రీశ్రీశ్రీ స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(64) ఈ బాధ్యత తీసుకుంటారని ప్రకటించాడు. సీమాంధ్ర సభ్యులంతా చప్పట్లు కొడుతుండగా వివేకా లేచి వెళ్లి ఆయన నుండి బాధ్యతలకు గుర్తుగా ఖడ్గాన్ని స్వీకరించారు. సీఎం కిరణ్ ఉండి... సీమాంధ్రను గెలిపించగలననే నమ్మకం నీకుందా అని వివేకాను అడిగాడు. దానికాయన... యుద్ధంలో గెలవాలంటే మనం బలంగా ఉండాలి, కాని రాజకీయ యుద్ధంలో గెలవాలంటే ప్రత్యర్థిని బలహీనపరచాలి. ఈ లాజిక్‌తోనే గెలుస్తానని చెప్పాడు. ఆ లాజిక్ అందరికీ అర్థం కాకపోయినా వివేకాకు బెస్టాఫ్‌లక్ చెప్పి లేచారు.

★★★★★

తెలంగాణభవన్‌లో తెలంగాణ ఎమ్మెల్యేలంతా సమావేశమయ్యారు. కేసీఆర్ ఆ సమావేశానికి వచ్చాడు. ఈ పందేలలో తెలంగాణకు ఇన్‌ఛార్జ్‌గా హరీష్‌రావును నియమించారు. పందేలలో పాల్గొనే కోడి పుంజు, పొట్టేలు, గుర్రంకు మద్యం బాగా తాగించాలని, అప్పుడే అవి రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాయని కేసీఆర్ సలహా ఇచ్చాడు.

★★★★★

కనుమ పండుగరోజు... అసెంబ్లీ ప్రాంగణంలో మొదట కోడిపందెం మొదలైంది. హరీష్‌రావు చేతిలో బాగా బలిసిన కోడి ఉంది... వివేకా చేతిలో మాత్రం 'నిమ్స్' ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన పేషంట్‌లా వున్న బక్కపల్చటి కోడి ఉంది. కాసు కృష్ణారెడ్డి వచ్చి వివేకాతో... అన్నా, వాళ్ల కోడేమో బలంగా వుంది, మన కోడేమో బలహీనంగా ఉంది... గెలుస్తుందంటావా అని అడిగాడు. ఇక్కడ బలం కాదు, బుర్ర ముఖ్యం అని వివేకా అన్నాడు. తర్వాత హరీష్‌రావు, వివేకాలు రెండు కోళ్లను రెచ్చగొట్టి బరిలోకి వదిలారు. బలిసిన తెలంగాణ కోడి నీరసంగా కదలలేకపోతుంటే, బక్కపల్చటి సీమాంధ్ర కోడి దానిని చీల్చి చెండాడింది. చివరకు తెలంగాణ కోడి చచ్చిపోయింది. మొదటి పందెంలో గెలవడంతో సీమాంధ్రనేతలు చప్పట్లుకొట్టారు. తర్వాత అక్కడే పొట్టేళ్ల పందెం మొదలైంది. తెలంగాణ నుండి ధిట్టంగా వున్న పొట్టేలును దించారు. సీమాంధ్ర వైపు వారం నుండి తిండి తిననట్లున్న పొట్టేలును వదిలారు. ఈ పోటీలో సీమాంధ్ర పొట్టేలు చిత్తుచిత్తుగా ఓడిపోయింది. ఈసారి తెలంగాణ వాళ్లు ఆనందంతో గెంతులేసారు.

రెండుప్రాంతాలు చెరో విజయంతో సమానంగా నిలవడంతో మూడో పందెం కీలకంగా మారింది. ఇరుప్రాంతాల నేతలలో టెన్షన్ మొదలైంది. గుర్రాల రేస్‌కు ట్యాంక్‌బండ్ రోడ్‌ను ఎంచుకున్నారు. ఇక్కడ బక్కపల్చటి గుర్రంపై వివేకా, బలిసిన గుర్రంపై హరీష్‌రావు కూర్చున్నారు. స్పీకర్ నాదెండ్ల పచ్చజెండా ఊపాడు. వివేకా గుర్రం రాకెట్‌లా దూసుకుపోసాగింది. హరీష్‌రావు గుర్రం మాత్రం పెద్దాపరేషన్ జరిగిన పేషంట్‌లా నీరసంగా నడవసాగింది. హరీష్‌రావుతో పాటు మిగతా తెలంగాణ నేతలు ఆ సీన్ చూసి బిత్తరపోయారు. వారికి ముచ్చెమటలు పట్టాయి. హరీష్‌రావు ఎంతగా అదిలించినా ఆ గుర్రం ముందుకు అడుగులు వేయలేక కుప్పకూలిపోయింది. ఈలోపు వివేకా టార్గెట్ పూర్తి చేసుకుని వచ్చాడు. సీమాంధ్ర నేతలు రెండు పందేలలో గెలవడంతో ఆ ప్రాంత నేతలు సంబరాలలో మునిగిపోయారు.

★★★★★

సీఎం ఛాంబర్‌లో వివేకాకు అభినందన కార్యక్రమం పెట్టారు. ఆయనను శాలువాలు, గజమాలలతో సత్కరించారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉందంటారు. మరి వివేకా విజయం వెనుక ఉన్నది ఎవరో చెప్పాలని శైలజానాథ్ కోరారు. అప్పుడు వివేకా... నా వెనుక స్త్రీలు, పురుషులు ఎవరూ లేరు. ఉన్నదల్లా నేను ప్రేమగా పెంచిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలే... నెల్లూరు నుండి వాటిని ఒక సూట్‌కేసులో తెప్పించాను.

తెలంగాణభవన్‌లో పందేల కోసం వాళ్లు తెచ్చిన గుర్రం, పొట్టేలు, కోడి వున్న గదిలోకి వాటిని వదిలాను. అంతే మా ముదురుదోమలు కరిచి వాటికి చికెన్‌గున్యా జ్వరం వచ్చింది. అవి బలహీనపడ్డాయి. శత్రువుని బలహీన పరచడం ద్వారా మనం గెలిచామని చెప్పాడు. మరి పొట్టేలు పందెంలో ఎందుకు ఓడిపోయామని జె.సి.దివాకర్‌రెడ్డి అడిగాడు. దానికి వివేకా... పొట్టేలుకు బొచ్చు మందం కదన్నా... మా దోమల ముల్లు వాటిలో దిగి వుండదు. అందుకే దానికొక్క దానికే చికున్‌గున్యా రాలేదు. లేకుంటే ఆ పందెం కూడా మనమే గెలిచుండేవాళ్లమని చెప్పి లేచాడు.

★★★★★

## కదంబం

## యుద్ధ రచన

ఆశారాజు,
హైదరాబాద్, 93923 02245.

దీపం ఇంకా మాట్లాడుతోంది
మొగలిరేకుల గురించి
మొదుగుపూల గురించి
రాత్రిలో విరిసిన తోటలా
కాంతి అల్లుకుంటోంది

దీపం నెమ్మదిగా పాడుతోంది
అడవి వెన్నెల గురించి
ఎర్రమల్లెల గురించి
వాగు పారుతున్నట్టు
వెలుగు పొర్లుతోంది

దీపం కూనిరాగాలు తీస్తోంది
అప్పుడప్పుడు కిటికీలోంచి
దురుసుగా గాలి బెదిరిస్తోంది
చిన్నపిల్లల ఏడ్పులా
క్యాలెండర్ కొట్టుకుంటోంది
రహస్యం చెపుతున్నట్టు
నీడ, గోడ మీద వణుకుతోంది

దీపం రెప్పలు కొట్టుకుంటోంది
చెట్లు నడుస్తున్నట్టు
సవ్వడి దగ్గరవుతోంది
కరవాలం సానబడుతున్నట్టు
చీకటి తలుపుకు రుద్దుకుంటోంది
వింటినారి బిగిస్తున్నట్టు
ఉచ్ఛ్వాస నిశ్వాసాల
పట్టు వినిపిస్తోంది
పొడుగ్గా ఊగుతున్న దీపం
శర పరంపరలా పరుచుకుంటోంది

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ద్వారదర్శనం

## ➤ భక్తులతో పోటెత్తిన వైష్ణవాలయాలు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నెల్లూరు జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో పోటెత్తాయి. తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, నరసింహకొండలోని వేదగిరి నరశింహ స్వామి ఆలయం, గూడూరు, కావలి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట తదితర ప్రాంతాల్లోని వైష్ణవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైకుంఠ ద్వారదర్శనం చేసుకున్నారు. నెల్లూరు రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి వారు ఉభయనాంచారుల సమేతంగా తెల్లవారుజామున ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు ఆధ్వర్యంలో అధ్యక్షులు ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. రంగనాథుడ్ని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ దంపతులు, ప్రముఖ సినీదర్శకులు కె.విశ్వనాథ్ తదితర నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ దుగ్గిశెట్టి భారతి, కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.



వైకుంఠద్వారదర్శనం కోసం వేచివున్న భక్తులు

***వేణుగోపాలస్వామి దేవస్థానంలో...*** మూలాపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు వైకుంఠ ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారు పురవీధుల్లో విహరించారు. దేవస్థాన ట్రస్టీలు, మేనేజర్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

***టిటిడి కల్యాణ మండపంలో...*** దర్గామిట్ట టిటిడి కల్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ స్వామివారు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా 11వ తేదీ తెల్లవారుజామున దివ్య దర్శనంతో భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. అర్చకులు వేదగిరి ఫణిశర్మ స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. భక్తులకు శ్రీ స్వామివారి పవిత్ర కంకణాలు, లడ్డూ ప్రసాదాన్ని పంపిణీచేసారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పెనుశిల హుండీ ఆదాయం

## రూ. 48.60 లక్షలు



నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం భారీగా రూ. 48.60 లక్షలు లభించింది. శుక్రవారం స్వామివారి అలంకార మండపంలో శ్రీవారు, ఆదిలక్ష్మి అమ్మవారు, ఆంజనేయస్వామి వార్ల హుండీలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.48.60 లక్షలు రాబడి వచ్చిందని దేవదాయశాఖ సహాయ కమీషనర్ శివకుమార్ పేర్కొన్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 612 గ్రాముల బంగారం, 3.505 కేజీల వెండి వచ్చిందని, దీంతో పాటు శ్రీవారి నిత్యాన్నదానం హుండీకి రూ.64 వేలు రాబడి వచ్చిందని శివకుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు పాలకమండలి సభ్యులు బండి తిరుపాల్‌రెడ్డి, మన్నార్పు రవికుమార్, చెలికం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మానసిక ఉల్లాసానికి, ఉత్సాహానికి ఆటలు అవసరం



విజేతకు బహుమతినందజేస్తున్న కమీషనర్ డి.జాన్‌శ్యాంసన్

నెల్లూరు కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో స్వామి వివేకానంద 150వ జయంతి సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలపోటీలు జరిగాయి. బహుమతిప్రదాన సభలో ముఖ్యఅతిథిగా నెల్లూరునగర కార్పొరేషన్ కమీషనర్ డి.జాన్‌శ్యాంసన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించి, వారిలో దాగివుండే సృజనాత్మకత మెరుగుపడేలా చేసి చదువులో ఉన్నతికి తోడ్పడతాయన్నారు. మరొక అతిథి నిర్మల ఏజన్సీస్ అధినేత సింగారెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఆధునిక యుగపు ఆధ్యాత్మిక వేత్తలలో గొప్పవ్యక్తి స్వామి వివేకానంద అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమసంఘం అధ్యక్షురాలు డి.ఆర్.ఇందిర, పినాకిని అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, ఎస్‌విఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, కవి పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కే కోత పెట్టి రోత పుట్టిస్తున్న ప్రభుత్వం

మామూలురోజుల్లోనే రేషన్‌తో ప్రజలకు పరేషాన్ అవుతుంటే పండుగ రోజుల్లో ప్రభుత్వం రేషన్‌కే కోతపెట్టి రోత కలిగిస్తోంది. సాధారణంగా హిందువులకు పెద్ద పండుగైన సంక్రాంతికి పిండివంటలు చేసుకోవడం ఆనవాయితీ. వాటికి కావలసిన అదనపు ఫలసరుకులు ఇవ్వాల్సిందిపోయి, నెల నెలా ఇచ్చే కోటాలోనే కోతపెట్టి పంపిణీ వ్యవస్థకే పంగనామాలు పెట్టినట్లయ్యింది. ప్రతినెలా ఇచ్చే కిలో పామాయిల్ నూనె జిల్లాలోని సగం మండలాల్లో, నెల్లూరు నగరంలో సరఫరా చేయకపోగా అత్తెసరుగా అరకేజీ చక్కెరతో సరిపెట్టింది. దీనినిబట్టి ప్రజల మీద ప్రభుత్వం ప్రేమ ప్రకటనలకి, నేతల మాటలకే అంకితమయినట్టుంది.

# ఫారెస్ట్ రేంజర్‌కు 22 వరకు రిమాండ్

నెల్లూరు జిల్లా అటవీశాఖాధికారి ఎన్.నాగేశ్వరరావు రూ.11.50 లక్షలను గుంటూరుకు తరలిస్తుండగా ఏసిబి అధికారులు వల పన్ని పట్టుకున్న సంగతి విదితమే. నాగేశ్వరరావు కేసుకు సంబంధించి కూపీలాగుతున్న అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఫారెస్ట్‌శాఖలోని అనేక మంది అధికారుల అక్రమాలు వెలుగుచూసాయి. అందులో భాగంగా నెల్లూరు ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తున్న మారుతీ ప్రసాద్ ఇళ్ల పై ఈ నెల 9వ తేది ఏసీబి అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. మారుతీప్రసాద్ స్థానిక బుజబుజనెల్లూరులో అత్యంత ఖరీదైన భవన సముదాయాన్ని నిర్మిస్తుండడంతో అందులో తనిఖీలు చేసారు. ఈ నిర్మాణానికి దాదాపు రూ.9 కోట్లు ఖర్చు అవుతున్నట్లు నిర్ధారించారు. అంతేకాక మారుతీ ప్రసాద్‌కు చెందిన ఇతర ఆస్తులను, నిర్మాణాలను తనిఖీ చేసారు. 9వ తేది మారుతీ ప్రసాద్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని 4వ నగర పోలీసు స్టేషన్లో అప్పగించారు. ఏసీబి డిఎస్పీ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ ఆయనను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 22వ తేది వరకు రిమాండ్ విధించారు.

# బినామీ అవినీతిని బయటపెట్టండి

తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీగా ర్యాలీ నిర్వహించి కార్పొరేషన్‌ను ఈ నెల 10వతేదీన ముట్టడించారు. ఈ సందర్భంగా నగరంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో గత కొన్నేళ్ళుగా జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, బినామీలను అడ్డం పెట్టుకుని పాలకులు అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. మాజీమేయర్ భానుశ్రీ బినామీ పేరుతో పనులు చేయిస్తున్నారని, విజిలెన్స్ విచారణ చేపట్టాలని శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేసారు. అనంతరం టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, మున్వర్‌భాషా తిరుమల నాయుడు, నూనె మల్లిఖార్జున్‌యదవ్‌లు కలిసి నగర మునిసిపల్ కమీషనర్ డి.జాన్‌శ్యాంసన్‌కు అక్రమాలపై వినతి పత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మండవ రామయ్య, వైవీ సుబ్బారావు, ధర్మవరం సుబ్బారావు, పడవల కృష్ణమూర్తి, మున్వర్, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు తిరుమలనాయుడు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

కళా క్రీడా సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగులకు పనిసామర్థ్యము, అధికారుల సహకారము బాగుంటుంది. వస్త్ర, ఆభరణ, ఫాన్సీ, హోటల్ వాణిజ్యాలకు ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు నిలబడి పోవటం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. షేర్ మార్కెట్ లాభాలలో ఉంటుంది. వివాహ ప్రయత్నాలు ఫలించగలవు. వ్యాపార వర్గాల వారికి కొంత ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఆదాయమునకు ధీటుగా ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులు పట్టుదలగా సాధించుకొంటారు. రియల్ ఎస్టేట్, కాంట్రాక్టులు, మార్కెటింగ్ రంగాల వారికి పరిస్థితి బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త పెట్టుబడులు, కొత్త కాంట్రాక్టులు దొరుకును. ఉద్యోగులకు పనిసామర్థ్యం, అధికారుల ఆదరణ ఉంటుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు అవకాశాలు రాగలవు. ఆర్థికంగా పుంజుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో మంచి అవకాశాలు, రాబడి, బాగుంటుంది. మీ సలహా సూచనలు ఇతరులకు మేలు కలిగిస్తాయి. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు అందుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

పెండింగ్ వ్యవహారాలు మరల అనుకూలంగా మారతాయి. బుధ, గురు వారాలలో ఖర్చులు అదనంగా ఉంటాయి. అనుకున్న పనులు నెరవేర్చుకొనడానికి తీవ్రంగా కృషి చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి. ప్రభుత్వ అనుమతులు పెండింగ్‌లో పడే అవకాశమున్నది. రావలసిన బాకీలు కొంత వరకు లభించగలవు. విలేకరులకు, మార్కెట్ రంగాల వారికి, కాంట్రాక్టర్లకు పని భారం వత్తిడి ఎక్కువగా ఉంటుంది.



బ్రహ్మశ్రీ
**స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 17.01.2014 నుండి
తేది. 23.01.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిధునములో గురువు, కర్కాటక సింహ కన్య తులలో చంద్రుడు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, ధనస్సులో శుక్రుడు, మకరంలో రవి బుధులు సంచరిస్తారు.

### పంచాంగము

పుష్యమాసమున ముహూర్తములు లేవు.

### ముహూర్తములు

ముహూర్తలు లేవు.

### పుష్యమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | పాడ్యమి | ప॥గం.11.28వ॥ |
| తేది. 18 | శని | విదియ | ప॥గం.01.32వ॥ |
| తేది. 19 | ఆది | తదియ | సా॥గం.03.21వ॥ |
| తేది. 20 | సోమ | చతుర్థి | సా॥గం.04.47వ॥ |
| తేది. 21 | మంగళ | పంచమి | సా॥గం.05.42వ॥ |
| తేది. 22 | బుధ | షష్ఠి | రా॥గం.06.48వ॥ |
| తేది. 23 | గురు | సప్తమి | రా॥గం.06.00వ॥ |

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. క్రొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాలకు అవకాశాలు కలిసి వస్తాయి. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు. అప్పుడప్పుడు టెన్షన్ ఉంటుంది. ఉద్యోగులు తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. లీజులు, టెండర్లకు అనుకూల సమయం. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుకొంటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ముఖ్య పత్రాలు, డబ్బు జాగ్రత్త పరచుకొనాలి. భూ సంబంధమగు లావాదేవీలు జరుగుతాయి. ఆర్థికంగా పెద్ద ఇబ్బందులుండకపోవచ్చును. వృత్తి పరంగా ప్రాముఖ్యం వ్యాపార రంగాల వారికి అభివృద్ధి, ఆదాయం ఉంటుంది. తొందర పాటు వ్యవహారాలు చేయకుండా ఆలోచించి నిర్ణయాలు చేయండి. ఇంటా బయట ఆర్థిక వ్యవహారాలు జరిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సొంత పనులకు ఆటంకాలు కలిగినా అధిగమించి పూర్తి చేసుకొంటారు, కాని టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరగడం ఉంటుంది. అనుకోని అదనపు ఆదాయము, కోర్టు కేసులందు అనుకూలత కలదు. ఆర్థిక పేచీలు ఆస్తి వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. క్రొత్త సంస్థల ప్రారంభములకు అనుకూలము. ప్రభుత్వ అనుమతులు లభించగలవు.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక వ్యవహారాలు, సొంత పనులను ఇతరుల పై పురమాయించవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. అదనపు ఖర్చులుండినా ఇబ్బందిపడరు. వృత్తి వ్యాపారాలవృద్ధి అవకాశాలు, ఆదాయము, పెరుగుదల, వృత్తి ఉపాధి పథకాలందు ఉద్యోగులు రాణించడం, అధికారులతో సుహృద్భావ పరిస్థితులుంటాయి. పనులు నిదానంగా జరుగుతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

దూరప్రయాణాలుంటాయి. ఆదాయము పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారులకు అవకాశాలు అందగలవు. వృత్తి జీవనంలో కొత్త నిర్ణయాలు, పలుకుబడి పెరగడం, రాబడి పెరగడం జరుగుతుంది. శుభాకార్యాలు నిర్ణయం కాగలవు. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి. స్థిరాస్తుల క్రయ విక్రయాలు ఖరారుకావడం జరుగుతుంది. పలుకుబడి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన చేసుకొంటారు. పరిశ్రమల యాజమాన్యాలకు, వ్యాపారులకు అధికారుల తనిఖీలుండవచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యంగా కాగలవు. గడచిన విషయాల పై వెలికితీసి మిమ్మల్ని విమర్శించే వారుంటారు. ఆర్థిక వ్యవహారాలలో, లౌకిక ఒప్పందాలలో తొందరపడవద్దు. వ్యాపారవృద్ధి సన్నగిల్లుతాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వస్తువు, డబ్బు పోగొట్టుకొనే అవకాశం ఉన్నది. ఖర్చులు అదనంగా ఉండినా, ఇబ్బందులు ఉండకపోవచ్చును. హామీలివ్వడం, ఋణాలివ్వడం చేయవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. సెన్సెక్స్ రాబడి సంతృప్తిగా ఉండదు. సొంత పనులు, వ్యవహారాలను సమయస్ఫూర్తితో నిర్వహించవలసి ఉంటుంది. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు నిదానంగా సానుకూలం కాగలవు. వృత్తి ఉపాధి వర్గాల వారికి ఆదాయం పెరుగుతుంది. వ్యాపార రంగాలవారికి మంచి ఆర్థికావకాశాలుంటాయి. అదనంగా ఖర్చులు తప్పవు, అయినా లోటు ఏమీ ఉండదు. ఉద్యోగులకు బాధ్యతల నిర్వహణలో తీరిక ఉండదు. మీ మాటకే విలువ, చెల్లుబాటు ఉంటుంది. మిమ్మల్ని విమర్శించేవారు మీకు చేరువకాగలరు.

# ఇస్లాం శాంతి సామరస్యతకు సూచిక

ఇస్లాం శాంతి సామరస్యతకు సూచికని మతపెద్ద అబ్దుల్ రజాక్‌హుస్సేన్ పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు ఎన్‌సిసికాలనీకి చెందిన మదర్సా బైతల్ ఖురాన్, మహాత్మాగాంధీనగర్‌కు చెందిన తీబుల్ ఇస్లాం, డైకాస్‌రోడ్డు సెంటర్‌లోని మదర్సా నూరిల్ ఇస్లాం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేది ముస్లీం సోదరులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఎన్‌సిసికాలనీ వెంగళరావునగర్, సంజయ్‌గాంధీనగర్, వెంకటరెడ్డినగర్ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ ప్రదర్శనలో నిర్వాహకులు ముజీర్, ఇస్మాయిల్, అన్సర్, ఖలీల్, మీరామొహిద్దీన్, జావీద్, జిలాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీనగర్ ప్రాంతంలో పేదలకు అన్నదానం చేసారు.

# పేకాట రాయుళ్ల అరెస్టు

నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడిపందేల పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. ఈ నెల 14న నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కావలి, గూడూరు పోలీసు సబ్ డివిజన్లలోని పలు స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 182 మంది కోడి పందాలు ఆడేవారిని, పేకాట రాయుళ్లను అరెస్టు చేసారు. వీరివద్ద నుంచి 77 పందెపు కోళ్ళు, రూ.51వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

# క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ళు అరెస్ట్

నెల్లూరు నగరం జెండావీధి, పెద్దబజారు ప్రాంతాలకు చెందిన ఇంతియాజ్, అంజాద్, గయాజ్, ఫిరోజ్‌ఖాన్, అస్లాంలు రూరల్ మండలం బుజబుజనెల్లూరులోని ఓ ఇంటిని బాడుగకు తీసుకొని అక్కడ క్రికెట్ బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఈ బ్యాచ్‌లో ఇంతియాజ్ నిర్వాహకుడు. మిగతా వాళ్ళంతా క్రికెట్ బెట్టింగ్‌లు ఆడేవారు. ఈ తతంగంపై స్థానికులు నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ సిఐ జయరామసుబ్బారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఈ నెల 9వతేదీ అర్ధరాత్రి సమయంలో స్పెషల్ బ్రాంచ్ బృందం మెరుపు దాడి చేసి వారందరిని అదుపులోకి తీసుకుంది. వీరివద్ద నుంచి 10 సెల్‌ఫోన్‌లు రూ.23వేలు నగదు, సెట్ అఫ్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరినందరిని, స్వాధీనం చేసుకున్న నగదు సామగ్రిని నెల్లూరు అయిదవ నగర పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. సిఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉత్సాహంగా భోగి... ఉల్లాసంగా సంక్రాంతి

గజగజ వణికించే చలిని సైతం లెక్క చేయకుండా ఈ నెల 14వ తేది తెల్లవారు జామున పిల్లలు, పెద్దలు, యువకులు ఉత్సాహంగా తమ నివాసాల ముందు భోగి మంటలు వేసుకుని, ఆ భోగిలోనే నీళ్ళు కాసుకుని తలస్నానాలు ఆచరించారు. భగవంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధుమిత్రులకు పిండి వంటలను పంపిణీ చేసారు. సాయంత్రం ఇంటిలోని పెద్దవారు భోగిపళ్ళను పిల్లల తలపై పోసి ఆశీర్వదించారు. భోగి పండుగ సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణం(భోగికల్యాణం) వైభవంగా నిర్వహించారు. 15వ తేది సంక్రాంతి పండుగ సందర్భంగా ఉల్లాసంగా వేడుకగా జరుపుకున్నారు. నెల్లూరు బోడిగాడితోట శ్మశానవాటికకు వెళ్ళి తమ పితృదేవతల సమాధులను శుభ్రపరచి పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. బోడిగాడితోట శ్మశానవాటిక జనంతో కిక్కిరిసింది. నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తదితర ప్రముఖులు హాజరయ్యారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



బోడిగాడితోటలో జరిగిన పెద్దలపండుగలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆనం వివేకా, ముంగమూరు

# అపరిశుభ్రత పులుముకుంది

(మొదటిపేజీ తరువాయి)

పదిరోజులకోగాని చెత్త ఎత్తే పరిస్థితి లేదు. చాలాచోట్ల డంపర్‌బిన్‌లు లేవు. ఆ ప్రాంతాల ప్రజలు ఇళ్ళల్లోని చెత్తను రోడ్లమీదే వేస్తున్నారు. పందులు, కుక్కలు ఈ చెత్తదిబ్బల వద్ద చేరి ఆ ప్రాంత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

నెల్లూరంటే ఒకప్పుడు చేపలపులుసు, రొయ్యల వేపుడుకు పెట్టింది పేరు. కాని ఇప్పుడు బలిసిన దోమలకు ప్రసిద్ధిగాంచింది. నగరంలో దోమలు లేని ప్రాంతమంటూ లేకుండాపోయింది. రాకాసి దోమల దాడితో జనం బెంబేలెత్తుతున్నారు. దోమల దెబ్బకు జనాలకు నిద్ర కూడా కరువవుతుంది. ముఖ్యంగా ఆయా ప్రాంతాలలో నివాసస్థలాలు మురికి గుంటలను తలపిస్తున్నాయి. ఇవే దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ఖాళీఫ్లాట్లలో మట్టి తోలించాలని, ప్రహరీ కట్టించి మురికినీరు నిల్వలేకుండా చేయాలని గతంలో కమీషనర్లుగా ఉన్నోళ్లు ఫ్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేసేవాళ్లు. ఆ నోటీసుల దెబ్బకు కొందరు తమ ఫ్లాట్లను మట్టితో నింపి బాగు చేసారు. కాని ఇప్పుడు నగర పాలకసంస్థ అధికారులు ఖాళీస్థలాల యజమానులకు ఆ విధంగా నోటీసులు కూడా జారీచేయడం లేదు. కొన్ని కాలనీల అసోసియేషన్‌లు ఈ పనిని మేమే చేస్తాం, ఖాళీస్థలాల యజమానులకు నోటీసులిచ్చి మాకు సహకరించండని కోరుతున్నా నగరపాలక సంస్థలో చలనం లేదు.

మురికి కాలువలు చూస్తే ముద నష్టంగా ఉంటున్నాయి. కాలువల్లో పూడికలు తొలగించే దిక్కు కూడా లేదు. గతంలో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేసేవాళ్లు. మురికి కాలువల్లో ఆయిల్‌బాల్స్ వదిలేవాళ్లు. ఇప్పుడు అలాంటి కార్యక్రమాలు చూద్దామన్నా కనిపించడం లేదు. నగరంలో పారిశుధ్యం పరమచెత్తగా వుంది. నగరపాలక సంస్థ నగరాన్ని దోమలకు, నగరంలోని జనాలను రోగాలకు వదిలేసారనిపిస్తుంది.

# క్లైమాక్స్‌లో మ్యాచ్

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరించినంత మాత్రాన కేంద్రం రాష్ట్ర విభజనపై వెనక్కుతగ్గే పరిస్థితి లేదు. కాకపోతే టి-బిల్లుపై చర్చకు మరికొంత గడువు కావాలని ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి రాష్ట్రపతిని కోరే అవకాశముంది. ఇంకా చివరి బంతి పడలేదని కిరణ్ చెప్పుకుంటూ వస్తున్నాడు. రాష్ట్ర విభజనను అడ్డుకోవడానికి ఇంతవరకు ఆయన చేసిన బలమైన ప్రయోగమంటూ ఏదీ లేదు. ఆయన ఏదన్నా బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీస్తాడేమోనని సీమాంధ్రులంతా ఎదురుచూస్తున్నారు. అయితే, అలాంటి బ్రహ్మాస్త్రాలేవీ ఆయన వద్దలేవని తేటతెల్లమవుతుంది.

కాకపోతే ఆయన చేయగలిగిందల్లా కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ పార్టీ నుండి బయటకు వచ్చి సొంతపార్టీని పెట్టడమే. ఈ నెల 23వ తేదీ తర్వాత ఆయన పార్టీని పెట్టవచ్చనే ప్రచారం జరుగుతుంది. సీమాంధ్రలోని అన్ని జిల్లాల్లో కొత్తపార్టీ ఫ్లెక్సీలు కూడా వెలిసాయి. సీఎం పార్టీ పెడితే ఏపి ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబుతో పాటు ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీలో వున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఆయనతో కలిసే అవకాశాలున్నాయి. అయితే ఆయన పార్టీ వల్ల కాంగ్రెస్‌కు కొత్తగా వచ్చే నష్టమేమీ లేదు. ఎందుకంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ఇంతకంటే నాశనమయ్యేది ఏమీ లేదు. అసెంబ్లీలో బిల్లును సమగ్రంగా చర్చించి ఓటింగ్ ప్రక్రియ పూర్తి కావాలంటే మరికొన్ని రోజులు గడువు తప్పదు. మరి రాష్ట్రపతి ఆ గడువు ఇస్తాడా అనేది చూడాలి. అలా గడువు ఇచ్చాడంటే టి-బిల్లు ఆమోదం విషయంలో అనుమానాలు నెలకొన్నట్లే! తీరిగ్గా చర్చించడానికి, తాపీగా నిర్ణయాలు తీసుకోవడానికి ఇక టైం లేదు. ఫిబ్రవరి నెలాఖరులో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఎన్నికల సంఘం సమాయత్తమవుతుంది. ఎన్నికల నోటిఫికేషన్‌లోపు పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందిందా సరే సరి. లేదంటే తెలంగాణ అంతే సంగతులు. కేంద్రంలో రాబోయే ప్రభుత్వం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. ముందు అసెంబ్లీ నుండి టి-బిల్లు బయటకు పోవాలి. పార్లమెంట్ ఉభయసభలలో బిల్లుపై మళ్ళీ చర్చ జరగాలి. పలు ప్రాంతీయ పార్టీలు టి-బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ప్రధానప్రతిపక్షం బీజేపీ తెలంగాణకు మద్దతు తెలుపుతున్నప్పటికి సీమాంధ్ర సమస్యలు, అపోహల మీద ఆ పార్టీ ఉభయసభలలో గళం విప్పే అవకాశం వుంది.

టి-బిల్లు సీన్ క్లైమాక్స్‌కొచ్చింది. అసెంబ్లీ నుండి పార్లమెంట్‌కు పోవాలి. ఉభయసభలలో చర్చ జరగాలి. గొడవలు, గందరగోళం ఉంటుంది. ఉభయసభల ఆమోదం పొందాక రాష్ట్రపతి ఆమోదముద్ర పడాలి. ఇదంతా నెలరోజుల్లోపే జరిగిపోవాలి. ఎక్కడా బ్రేకులు పడకుండా అంతా సాఫీగా సాగితేనే టి-బిల్లుకు మోక్షం. కాని నెలరోజుల్లో ఇంత ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయడమనేది అనుమానమే.

# ప్రభాకరుడు

(మొదటిపేజీ తరువాయి)

కాని ఆయన చేరేది ఖచ్చితం కాకపోవడంతో ఆదాల ప్రభాకర్‌రెడ్డినే నెల్లూరు లోక్‌సభ బరిలో దించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలపై జగన్ ప్రభావం ఉన్నా లోక్‌సభ ఎన్నికలకొచ్చే సరికి అది కాస్తా తగ్గుతుంది. ఇక్కడ నరేంద్ర మోడీ ఇమేజ్ పనిచేసే అవకాశముంది. తెలుగుదేశం బీజేపీల మధ్య పొత్తు కుదిరితే తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ అభ్యర్థులకు అది బాగా లాభిస్తుంది. సిటింగ్ ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి పట్ల కొంత వ్యతిరేకత వుంది. ఇది కూడా ఆదాలకు అనుకూలం కాగలదు. అసెంబ్లీ కంటే కూడా పార్లమెంట్‌కు ఆదాల మంచి అభ్యర్థి కాగలడు.


# కమలపుత్రులు

(2వపేజీ తరువాయి)

ఈ సీటు పోవచ్చు. బీజేపీ నాయకులు నెల్లూరు లోక్‌సభ సీటును ఆశిస్తున్నారు గాని అది ఇవ్వడం సందేహమే. అయితే జిల్లాకు సంబంధించినంతవరకు తెలుగుదేశంతో పొత్తు బీజేపీకి కలిసిరావడం లేదు. 1985లో పొత్తులో భాగంగా ఆత్మకూరు సీటు నుండి బీజేపీ అభ్యర్థిగా వెంకయ్య నాయుడు పోటీ చేసి ఓడిపోయాడు. 1989లో అదే స్థానం నుండి బీజేపీ అభ్యర్థిగా కర్నాటి ఆంజనేయరెడ్డి ఓడిపోయాడు. 2004లో పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థులు నెల్లూరు లోక్‌సభకు, నెల్లూరు, ఆత్మకూరు అసెంబ్లీకు పోటీ చేసారు. ఈ మూడుచోట్లా బీజేపీ ఓడిపోయింది.

తెలుగుదేశంతో పొత్తు వల్ల బీజేపీ ఇప్పటి వరకు లాభపడిందేమీ లేదు. రేపు కూడా ఏ మాత్రం లాభం ఉంటుందో చూడాలి.

# కమనీయం... కనుమ తెప్పోత్సవం



కనుమ పండుగనాడు కన్నుల పండువగా నిర్వహించే నెల్లూరు నవాబు పేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం ఈ యేడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించారు. అత్యంత సుందరంగా అలంకరించిన తెప్ప వాహనంపై స్వామి అమ్మవార్లను ప్రతిష్ఠించి మైపాడుగేటు వద్దగల జాఫర్‌సాహెబ్ కాలువలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవాన్ని కన్నుల పండువగా తిలకించారు. నగరంలోని వివిధ దేవస్థానాల నుండి తరలివచ్చిన దేవతామూర్తులు ఈ తెప్పోత్సవానికి అతిథులయ్యారు. ఈ తెప్పోత్సవంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర సమన్వయకర్త పి.అనిల్‌కుమార్‌యాదవ్, వైకాపా నాయకులు ఎం.ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

# చైన్‌స్నాచింగ్ బ్యాచ్ అరెస్ట్

## రూ॥5.50లక్షలు విలువైన సొత్తు స్వాధీనం

జల్సాలకు అలవాటుపడి ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్ చేస్తూ చైన్‌స్నాచింగ్(గొలుసు దొంగతనాల)లకు అలవాటుపడ్డ నలుగురు నిందితులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. అరెస్టయిన బ్యాచ్‌ను వారు చేసిన నేరాల వివరాలను నెల్లూరు జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ మంగళవారం క్యాంపు కార్యాలయంలో విలేకర్లకు తెలియజేసారు. రాయపుపాళెంకు నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన పాత్రాలపాటి సువేకానంద, ఎన్టీఆర్ నగర్ రాయపుపాళెంకు చెందిన షేక్ కరీముల్లా, నవాబుపేట లక్ష్మీపురానికి చెందిన మాణిక్యం మల్లికార్జున, కోటమిట్టకు చెందిన సయ్యద్ అజాద్ స్నేహితులు. బేల్దారి పనులు చేసుకునే వీరు ఖాళీ సమయాల్లో ఆటోలు నడుపుతుంటారు. దీంతో సంపాదించిన సొత్తు జల్సాలకు, కుటుంబపోషణకు సరిపోకపోవడంతో సులభమైన మార్గంపై దృష్టిపెట్టారు. ఇటీవల ఎక్కువగా చైన్‌స్నాచింగ్‌లు జరుగుతున్నాయని బైక్‌లపై తిరుగుతూ మహిళల మెడల్లోని గొలుసులు లాగేస్తున్నారని అనేక ఫిర్యాదులు రావడంతో పోలీసులు గట్టి నిఘా పెట్టారు. నిందితులు మంగళవారం ఉదయం కోవూరు జాతీయ రహదారి సమీపంలోని సాయిబాబా గుడి వద్ద వెళుతుండగా కోవూరు సిఐ మాణిక్యరావు ఆధ్వర్యంలో కోవూరు, కొడవలూరు ఎస్సైలు ఎం.గంగాధర్, జగన్‌మోహన్‌లు అరెస్టు చేశారు. విచారణలో పలు నేరాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. వీరు చోరీచేసిన మూడు బైక్‌లను బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితులపై సస్పెండ్ షీట్లు తెరవనున్నట్లు ఎస్పీ తెలిపారు.

**సిబ్బందికి రివార్డులు**

నిందితులను పట్టుకోవడానికి కృషిచేసిన నెల్లూరు రూరల్ డిఎస్పీ వీఎస్ రాంబాబు, కోవూరు సిఐ మాణిక్యరావు ఐ.వెంకటేశ్వర్లు, ఏఎస్సై కె.సురేంద్ర, పివి కృష్ణయ్య, పి.విజయప్రసాద్, షేక్ సిరాజ్, షేక్ రియాజ్, శ్రీనివాసులు, జి.ఓంకార్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## కాలధర్మం

# సోమిరెడ్డి హైమావతమ్మ

జిల్లాలో పేరెన్నికగన్న రాజకీయ కుటుంబాల్లో ఒకటి స్వర్గీయ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి కుటుంబం. ఒకప్పుడు జిల్లాలో శక్తివంతమైన రాజకీయాలు నడిపి తన ప్రత్యేకతను చాటుకున్న సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి సతీమణి శ్రీమతి హైమావతమ్మ 14వ తేదీ అర్ధరాత్రి దాటాక స్వర్గస్తులయ్యారు. ఆమె వయసు 76 సంవత్సరాలు. గత కొంతకాలంగా ఆమె చెన్నైలోని విజయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమారుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలుగుదేశంపార్టీలో రెండు పర్యాయాలు మంత్రిగా, శాసనసభ్యుడిగా, జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడుగా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా పలు పదవులు నిర్వహించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన తెలుగుదేశంపార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులుగా అందరికీ సుపరిచితుడే. సోమిరెడ్డి హైమావతమ్మ మరణవార్త తెలిసి 15వ తేదీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి రాజమోహన్‌రెడ్డి, మాజీమంత్రి కోడెల శివప్రసాద్, ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీద మస్తాన్‌రావు, పరసా రత్నం, కురుగొండ్ల రామకృష్ణ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, అలాగే జిల్లాలోని తెలుగుదేశం, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, లోక్‌సత్తా వంటి పార్టీల ముఖ్యనేతలందరూ అల్లీపురంలోని సోమిరెడ్డి ఇంటికి వెళ్లి ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. వృద్ధాప్యంలో వున్న తన తల్లిని ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఆమె మరణంతో శోకసముద్రంలో మునిగిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి సానుభూతి తెలుపుతూ, హైమావతమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తుంది 'లాయర్'.



# గూడూరు డివిజన్ వార్తలు

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల ముగింపు సభలో మాట్లాడుతున్న డిఎస్పీ చౌడేశ్వరి

గూడూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రికెట్ పోటీలు రెండు రోజులుగా పోలీసులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు జరుగుతున్నవి. ఆదివారం ముగిసాయి. ఆ రోజు సాయంత్రం ఏర్పాటుచేసిన బహుమతి ప్రధానోత్సవంలో డిఎస్పీ చౌడేశ్వరి పాల్గొని ప్రసంగిస్తూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగడం అవసరమని అన్నారు. నిత్యం పనిఒత్తిడికిలోనయ్యే వారికి క్రీడలు ఆటవిడుపునిస్తాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన పోలీస్, ప్రింట్ మీడియా జట్లకు జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, షేక్ రియాజ్‌అహ్మద్, మల్లు విజయకుమార్‌రెడ్డి, ఎం.వి.రమణయ్య, మేజర్ పొనకా శ్రీనివాసులురెడ్డి, కోట సునీల్‌కుమార్, వాసుగౌడ్, పోటీల సమన్వయకర్త కె.చంద్రశేఖర్, గూడూరు జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా వివేకానంద జయంతి



స్వామి వివేకానంద జయంతి సభలో చిత్రపటానికి పూలమాలలువేస్తున్న ఉత్సవసమితి సభ్యులు

గూడూరులో ఆదివారం నాడు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాలవ్యానగర్ ప్రాంతంలో ఉత్సవ సమితి ఆధ్వర్యాన వివేకానందుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణంలోని గమళ్ళపాలెం, టవర్‌క్లాక్ సెంటర్, ఇందిరానగర్, తదితర ప్రాంతాల్లో కూడా వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాలవ్యానగర్‌లో వివేకానందునికి కాంస్యవిగ్రహం ఏర్పాటుకు దాత గోవిందరాజు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రహాస్, బయ్యా వాసు, కృష్ణంరాజు, మాజీ కౌన్సిలర్ చెంచురామయ్య, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి

### ఆర్డీవో మధుసూదనరావు



క్రీడాకులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో

క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు స్నేహభావం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని ఆర్డీవో మధుసూదనరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వెటరన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్‌ట్రస్టు నిర్వాహకుడు కె.హరిశ్చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పట్టణ, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు దాతలు చొరవ చూపించాలన్నారు. సభ్యులు కె.మునిగిరీష్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, పవన్ కుమార్, పాశం సునీల్‌కుమార్, రవీంద్రబాబు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గ్రామదేవత తాళమ్మ గ్రామోత్సవం

గూడూరు గ్రామదేవత తాళమ్మ గ్రామోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. విజయనగర్ కాలనీలోని ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం ఘనంగా జరిగింది. రెండో పట్టణ పరిధిలోని సున్నపుబట్టీవీధి నుంచి గౌడసంఘం ఆధ్వర్యాన తాళమ్మ అమ్మవారిని అలంకరించేందుకు గజమాలను మేళ తాళాలు, తప్పెట్ల మోతల నడుమ ఉత్సాహంగా యువత చిందులు వేస్తూ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. విగ్రహానికి అలంకరణ చేసిన అనంతరం పట్టణంలో ఊరేగింపు చేసారు. తాళమ్మ ఊరేగింపులో ప్రజలు భోగి మంటలు వేస్తూ స్వాగతం పలకడం ఆనవాయితీగా వస్తోంది.





## తెలుగుసీత కన్నుమూత



అలనాటి అందాల తార, ఆంధ్రుల అభిమాన నటిగానే కాక తమిళులచే తమిళసెల్వి, కలైమామణిగా కీర్తింపబడ్డ వెండితెర సీతమ్మతల్లి అంజలీదేవి ఈ నెల 13న స్వర్గస్తులైనారు. భౌతికంగా ఆమె దూరమైనా ప్రేక్షకుల మదిలో మాత్రం చిరకాలం సజీవంగానే వుంటారు. ఎనిమిదేళ్ళ ప్రాయంలోనే రంగస్థల నటిగా అరంగేట్రం చేసిన అంజలీదేవి స్వస్థలం తూర్పుగోదావరిజిల్లాలోని పెద్దాపురం. 1927ఆగష్టు 24న నూకయ్య - సత్యవతి దంపతులకు ఆమె జన్మించారు. 1947లో మీర్జాపురం రాజా నిర్మాతగా, సి.పుల్లయ్య దర్శకుడిగా నిర్మించిన "గొల్లభామ" సినిమా ద్వారా ఆమె వెండితెరకు పరిచయమై "శ్రీలక్ష్మమ్మకథ", "పల్లెటూరిపిల్ల" చిత్రాలలో మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని, నిర్దోషి, అనార్కలి, సువర్ణసుందరి, స్వర్ణమంజరి, సతీసక్కుబాయి, చరణదాసి, భక్తతుకారాం లాంటి ఉత్తమ చిత్రాలలో కథానాయికగా ఆంధ్రుల గుండెల్లో చెరగని ముద్రవేసింది. 'లవకుశ' చిత్రంలో సీత పాత్రలో తరతరాలకు గుర్తుండిపోయే నటిగా గణుతికెక్కింది. సుదీర్ఘ సినీజీవితంలో 400కుపైగా చిత్రాల్లో నటించి 1994లో పోలీస్‌అల్లుడు చిత్రంలో నటనకు విశ్రాంతి ప్రకటించింది. తెలుగు, తమిళంతో పాటు హిందీ చిత్రాల్లో కూడా ఆమె నటించి రాణించింది. పుట్టపర్తి సత్యసాయి భక్తురాలైన అంజలీదేవి ప్రతియేటా ఆయన జయంతి వేడుకల్లో పాల్గొంటూ వచ్చారు. కొంతకాలంగా అనారోగ్యంతో చెన్నైలోని విజయాహాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. అశేషఅభిమానుల కంటతడితో ఘూర్ణిల్లిన చెన్నైలోని బిసెంట్‌నగర్ శ్మశానవాటికలో ఈ నెల 14న ఆమె అంత్యక్రియలు జరిగాయి. దివికేగిన తెలుగుసీతమ్మ అంజలీదేవి మరణం పట్ల 'లాయర్' ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది.

# మూ'వీ'క్షణం



## ఇక 'ఆగడు'

సంక్రాంతి విరామం తర్వాత ప్రిన్స్ మహేష్‌బాబు 'ఆగడు' సినిమాపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టనున్నట్లు తెలుస్తుంది. ఈ నెల 18 నుండి మొదలయ్యే సినిమా షెడ్యూల్‌లో ఆయన నటించనున్నారు. రాయలసీమ కథా నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ సినిమాలో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ తమన్నా పాత్ర ఈ చిత్రంలో చాలా కామెడీగా వుంటుందట! శ్రీను వైట్ల దర్శకత్వం, తమన్ మ్యూజిక్‌తో ఈ సినిమా వస్తుంది.

## సెకెండ్ ఇన్నింగ్స్

డైలాగ్ కింగ్ సాయికుమార్ సినీ ఇండస్ట్రీలో సెకెండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టాడు. రామ్‌చరణ్ నటించిన 'ఎవడు' సినిమాలో ఆయన చేసిన విలన్ పాత్రకు గాను మంచి ప్రశంసలు అందాయి. అలాగే విలక్షణ నటుడు శ్రీహరి లేకపోవడంతో ఆయన స్థానాన్ని సాయికుమార్ బర్తీచేయగలడని భావిస్తున్నారు. వాయిస్, స్క్రీన్‌మీద లుక్ కూడా సాయికుమార్‌కు అదనపు ఆకర్షణ. ఈ కోవలోనే అవకాశాలెక్కువ వస్తున్నాయి.





## హిందీకి సంతకం

తెలుగు, తమిళ సినీ పరిశ్రమలలో తన సత్తాను చాటుకున్న కాజల్ అగర్వాల్ హిందీలోనూ ఉనికిని చాటుకుంటుంది. ఇప్పటికే రెండు హిందీ సినిమాల్లో నటించిన ఆమె, మూడో సినిమాకు సంతకం చేసినట్లు సమాచారం. గత యేడాది అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించిన 'స్పెషల్ ఛబ్బీస్' సినిమా ప్రశంసలందుకుంది. ఆమె మూడవ సినిమా ఫిబ్రవరి నుండి మొదలవుతుంది.

## ప్రభుత్వ వైద్యశాలలో వసతులు కరువు

గూడూరు పట్టణంలోని వంద పడకల ప్రాంతీయ వైద్యశాలలో అన్ని వసతులు ఉన్నాయి. అయినా ఇక్కడకు వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. గూడూరు డివిజనల్ కేంద్రం, జంక్షన్ కావడంతో పలుప్రాంతాల నుంచి నిత్యం వైద్యం కోసం పేదలు వందల సంఖ్యలో తరలివస్తారు. ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సరైన వైద్యం అందడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలేని సమయంలో ఉపయోగపడాల్సిన జనరేటర్‌ను వినియోగంలోకి తేవడంలో శ్రద్ధ కనబర్చడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో కోతల వేళ ఆసుపత్రిలో చీకట్లు ఆలముకుంటున్నాయి. వివిధ పరీక్షల నిమిత్తం వచ్చిన రోగులు నిరీక్షించి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వైద్యశాలలో సౌకర్యాలు కల్పించాలి.

## సమైక్యాంధ్ర కరపత్ర ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జయకుమార్‌రెడ్డి అనుచరులు

రాష్ట్ర విభజన ప్రక్రియను నిరసిస్తూ సమైక్యాంధ్ర కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఆనం జయకుమార్‌రెడ్డి ఇటీవల విడుదల చేసిన కరపత్రాన్ని నెల్లూరు నగరంలో ప్రతి డివిజన్‌లోని తన ముఖ్యఅనుచరుల ద్వారా పంపిణీ చేసారు. ఈ నెల 13న నవాబుపేట, స్టోన్ హౌస్‌పేట ప్రాంతంలో వెంకటేశ్వర్లుయాదవ్, వెంకటేశ్వర్లు నాయుడు, బుజమ్మ, మహిళా కార్యకర్తలు ఇంటింటికి సమైక్యాంధ్ర కరపత్రాన్ని పంపిణీచేసారు. విఆర్‌సి కూడలి నుండి ఏసిబొమ్మ వరకు ఏసునాయుడు, ఆసిఫ్‌బాష కొర్లగుంటబాబు, ఆర్ఎస్ఆర్, ఉజ్వల్, రాజారెడ్డి, గార్లపాటి విజయకుమార్, నాగేశ్వరరావు, రూబి, నాగేంద్ర తదితరులు కరపత్రాలు పంచుతూ సమైక్యాంధ్ర కోసం నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఏసునాయుడు, ఆసిఫ్‌బాషాలు మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమం మొదలైనప్పటి నుండి తమ నేత ఆనం జయకుమార్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో పోరాట పటిమను రగిలించారని, ఆయన నిజమైన ఉద్యమనేత అని, ఆయన నేతృత్వంలో ప్రతిఒక్కరు పోరాటంలో పాలుపంచుకొని కేంద్రప్రభుత్వం కళ్ళు తెరుచుకొనేలా చేయాలని కోరారు.

# కేసీఆర్ నిర్ణయమే కీలకం

- కాంగ్రెస్‌లో విలీనం చేస్తే కేసీఆర్ తెరమరుగు
- పొత్తు కుదుర్చుకుంటే నమ్మివచ్చిన వారికి మొండిచేయి
- కాంగ్రెస్‌తో దోస్తీని వ్యతిరేకిస్తున్న టిఆర్ఎస్ శ్రేణులు




*తెలంగాణ బిల్లుపై కాంగ్రెస్ అధిష్టానం మొదట్లో చూపినంత దూకుడు చూపడం లేదు. షిండే, దిగ్విజయ్‌సింగ్‌లు కూడా దూకుడు తగ్గించారు. సప్త సముద్రాలు పొంగినా, భూమి బద్ధలైనా, ఆకాశం వూడి క్రింద పడ్డా తెలంగాణ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని మొన్నటివరకు వాళ్లు చెబుతూ వచ్చారు. మాటలతోనే సీమాంధ్రుల గుండెలపై పెట్రోల్‌పోసి మంటలు రగిలించారు. టి-బిల్లు సీన్ క్లైమాక్స్ కొచ్చింది. ఈ దశలో దిగ్విజయ్, షిండేల మాటల వేగం తగ్గింది.*

టి-బిల్లు ఆమోదం పొందినా, లేదా పార్లమెంట్ గేట్ ముందు బోర్లాపడినా ఇందులో కేసీఆర్ నిర్ణయమే కీలకం కాబోతుంది. కాంగ్రెస్ అధిష్టానం ఏ ఫలితాన్నయితే ఆశించి రాష్ట్ర విభజన పేరుతో ఇంత వినాశనానికి ఒడిగట్టిందో ఆ ఫలితం కేసీఆర్ నిర్ణయం మీదే ఆధారపడి వుంది. తెలంగాణలో ఎంపీ సీట్లను ఆశించే కాంగ్రెస్ విభజనకు ఒడిగట్టింది. తెలంగాణలో సీట్లన్నీ రావాలంటే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయాలి. లేదంటే కనీసం పొత్తన్నా పెట్టుకోవాలి. కాని ఇప్పుడున్న పరిస్థితులను చూస్తుంటే ఆ రెండు కూడా కష్టసాధ్యమైన ప్రక్రియగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం కావడానికి కేసీఆర్ ఒప్పుకున్నా టీఆర్ఎస్ శ్రేణులు ఒప్పుకోవు. తెలంగాణలో పార్టీ మంచి ఊపుమీదున్నప్పుడు కాంగ్రెస్‌లో విలీనం చేయాల్సిన అవసరమేముందని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. పార్టీని విలీనం చేస్తే తర్వాత తన పరిస్థితేంటో కూడా కేసీఆర్‌కు తెలుసు. చిరంజీవి లాగే ఈయన కూడా టెన్‌జనపథ్ ముందు చేతులు కట్టుకుని నిలబడాలి. కాబట్టి కేసీఆర్ అంత తెలివి తక్కువ పని చేయడు.

పోనీ పొత్తు పెట్టుకుందామా అంటే... తనను నమ్మి వచ్చిన చాలా మంది నాయకులకు ఆయన అన్యాయం చేయాల్సివస్తుంది. ఇటీవల కాలంలో కాంగ్రెస్, తెలుగుదేశంల నుండే చాలామంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే వారిలో చాలామందికి సీట్లు దక్కవు. కాబట్టి కాంగ్రెస్‌తో పొత్తుకు టీఆర్ఎస్ సుముఖంగా లేదు. టీఆర్ఎస్ తమ దారిలోకి రాకుంటే కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ బిల్లు పార్లమెంట్‌కు వచ్చినప్పుడు తన క్యారెక్టర్‌ను మార్చుకునే అవకాశముంది.

# తెగని కోవూరు పంచాయితీ


- ⌘ చంద్రబాబుకు సమస్యగా మారిన కోవూరు ఇన్‌ఛార్జ్ ఎంపిక
- ⌘ పెళ్ళకూరును మార్చొద్దంటూ అధిష్టానంపై కార్యకర్తల ఒత్తిడి

మిగిలిన అన్ని నియోజకవర్గాలలో తెలుగుదేశంపార్టీకి సరైన అభ్యర్థులు దొరక్క అదొక సమస్యగా ఉంటే కోవూరు నియోజకవర్గంలో మాత్రం టిక్కెట్‌కు పోటీ ఎక్కువై చంద్రబాబుకు తల పట్టుకునే పరిస్థితి వచ్చింది. కోవూరు సీటు విషయంలో ఏదీ తేల్చలేక చంద్రబాబు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గంలో కార్యకర్తల అభిప్రాయాలను గౌరవించాలా లేక పార్టీలోని ముఖ్య నాయకుల సిఫార్సును పరిగణనలోకి తీసుకోవాలా అనేది చంద్రబాబు తేల్చుకోలేకున్నారు.

కోవూరు సీటు నుండి పోటీ చేయాలనే ఆసక్తితో పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి ఇక్కడ రెండేళ్ల నుండి వర్కవుట్ చేస్తున్నారు. పాదయాత్ర పెట్టుకుని ప్రతి గ్రామం తిరిగారు. పంచాయితీ ఎన్నికలలో కూడా పార్టీ మద్దతుదారులుగా పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఆర్థికంగా సహకరించారు. దీంతో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పట్ల పార్టీ కార్యకర్తల్లో, నాయకుల్లో కొంత సానుకూల దృక్పథం వచ్చింది.

కాని సరిగ్గా కోవూరుకు పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమించే సమయమొచ్చేసరికి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రంగప్రవేశం చేసాడు. కోవూరు సీటిస్తే పార్టీలో చేరుతానంటూ చంద్రబాబుకు సందేశం పంపాడు. గతంలో సంచలనాత్మకంగా నల్లపరెడ్డి ప్రసన్నను ఓడించి ఉండడంతో చంద్రబాబు మనసు కూడా పోలంరెడ్డి వైపే లాగుతున్నట్లు తెలుస్తుంది. దీంతోపాటు కంభంపాటి రామ్మోహన్‌రావు వంటి ముఖ్య నేతలు కూడా పోలంరెడ్డి వైపే మొగ్గుచూపుతున్నారు. ఇది తెలిసి కోవూరులోని తెలుగు తమ్ముళ్లు మాత్రం గుడ్లురుముతున్నారు. పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డికి కాకుండా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి సీటిస్తే హోల్‌సేల్‌గా పార్టీకి రాజీనామాలు చేసి పోతామంటున్నారు. ఇప్పుడు కార్యకర్తలు కోరుకుంటున్న పెళ్ళకూరును వదులుకోవాలో, పార్టీలోకి వస్తానంటున్న పోలంరెడ్డిని వదులుకోవాలో తెలియక చంద్రబాబు జుట్టు పీక్కుంటున్నారు.

# 19వ వర్ధంతి



జననం: 08-11-1930 | మరణం: 18-01-1995

## స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి

వ్యవస్థాపకులు

లాయర్

తెలుగు వారపత్రిక

మహనీయుని మహాత్మకు

మా నివాళి.

'లాయర్' సిబ్బంది | కుటుంబసభ్యులు

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.